# విశాల భారతి

30-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 176


## ప్రభుత్వ ఉద్యోగులకు డబుల్ బొనాంజా

- తాజాగా రూ. 2,000 కోట్లు విడుదల
- మొత్తం రూ. 4,000 కోట్లు చెల్లింపు
- రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలు 100శాతం క్లియర్
- సెప్టెంబర్ 2025 వరకు బకాయిలన్నీ పూర్తి
- రూ. 10 వేల లోపు 5 లక్షల బిల్లుల సెటిల్‌మెంట్
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల సంతోషం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన పెన్షనర్ల ముఖాల్లో ఆనందపు వెలుగులు నింపే దిశగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన బకాయిల పర్వానికి ముగింపు పలుకుతూ, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఉద్యోగ వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ప్రత్యేక చొరవతో, రాష్ట్ర ఆర్థిక శాఖ మంగళవారం మరొక కీలక ప్రకటన ద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకుంది. గత ప్రభుత్వాల హయాంలో పేరుకుపోయిన ఆర్థిక భారాన్ని మోస్తూ, అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులను చక్కదిద్దుతూనే, ఉద్యోగుల సంక్షేమానికి మిగతా 3లో..



## ఏడాది గడిచినా తీరని బాధ

### సిగాచి బాధితులకు 'కోటి' ఆశలు.. తీరని కలలేనా?

- ఏడాది క్రితం జరిగిన భారీ పేలుడులో భారీ ప్రాణనష్టం
- భద్రతా నిబంధనలను విస్మరించడమే ప్రమాదానికి కారణం
- హామీ ఇచ్చిన రూ.కోటి పరిహారం ఇంకా అందలేదు
- పర్యవేక్షణ లోపించిన అధికారులపై చర్యలు లేవు
- పరిహారం, బాధ్యులపై విచారణ కోర్టులో కొనసాగుతోంది
- పరిశ్రమ మూతతో కార్మికులు రోడ్డున పడ్డారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి పరిశ్రమలో గతేడాది జరిగిన భారీ పేలుడు రాష్ట్రాన్ని కుదిపేసింది. ఈ దుర్ఘటన పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల పట్ల యాజమాన్యాల నిర్లక్ష్యాన్ని కళ్ళకు కట్టింది. పరిశ్రమల భద్రతను గాలికి వదిలేస్తే ఎలాంటి వినాశనం జరుగుతుందో చెప్పడానికి ఈ ప్రమాదం ఒక నిదర్శనం. లాభాల కోసం యాజమాన్యం ప్రదర్శించిన నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపం అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకున్నాయి. ప్రమాదం జరిగి ఏడాది పూర్తవుతున్న తరుణంలో భద్రతా లోపాలు, బాధితులకు అందాల్సిన పూర్తిస్థాయి పరిహారం, అధికారుల బాధ్యత వంటి అంశాలు మరోసారి తీవ్ర చర్చకు వస్తున్నాయి. ఈ విపత్తు వెనుక ఉన్న లోతైన కారణాలు, ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం, బాధితుల వేదన సమాజం ముందు నిలుస్తున్నాయి. పరిశ్రమల నిర్వహణలో భద్రత అనేది ప్రాధాన్యత అంశంగా ఉండాలని, లేనిపక్షంలో ఇలాంటి విషాదాలు తప్పవని ఈ ఘటన హెచ్చరిస్తోంది. సిగాచి ఉదంతం కేవలం ఒక ప్రమాదం మాత్రమే కాదు, వ్యవస్థాగత వైఫల్యాల సమాహారం. దీనిపై ఇప్పటికీ అనేక ప్రశ్నలు మిగిలిపోయాయి. నాడు జరిగిన ఆ భారీ పేలుడు తీవ్రతకు మూడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. మంటలు, దట్టమైన పొగ మధ్య చిక్కుకున్న కార్మికులు బయటపడలేకపోయారు. శిథిలాల కింద ఊపిరాడక, మంటల్లో చిక్కుకుని మొత్తం 54 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫైర్ సిబ్బంది, పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టినా, ప్రమాద తీవ్రత కారణంగా పలువురి మృతదేహాలను గుర్తించడం కూడా కష్టతరమైంది. ఏకంగా 8 మందికి సంబంధించిన ఆనవాళ్లు కూడా దొరకని స్థాయిలో పేలుడు సంభవించింది. మృతుల్లో బిహార్, ఒడిశా, యూపీ, ఏపీలకు చెందిన కార్మికులు అధికంగా ఉన్నారు. వలస కార్మికుల కుటుంబాలు ఈ ఘటనతో దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ప్రమాదం జరిగిన తీరు పరిశ్రమలో భద్రతా వ్యవస్థలు ఎంతటి బలహీనంగా ఉన్నాయో తెలియజేస్తోంది. మిగతా 2లో..



## హ్యామ్ రోడ్లతో మారనున్న తెలంగాణ

- మౌలిక వసతుల కోసం 'హ్యామ్' అమలు
- రహదారుల విస్తరణతో పరిశ్రమలు, ఉపాధి పెంపు
- హైదరాబాద్-విజయవాడ ఫోర్ లైన్, గ్రీన్ ఫీల్డ్ హైవేలు
- శ్రీశైలం మార్గంలో ప్రత్యేక ఎలివేటెడ్ కారిడార్
- నిర్మాణాల్లో కచ్చితమైన ప్రమాణాలు, పారదర్శకత
- ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్ణీత సమయంలో పూర్తి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ అభివృద్ధిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన హ్యామ్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తోంది. రహదారుల నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోబోతున్నాయని, దీనితో రాష్ట్ర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో ఏర్పాటు చేసిన ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి నూతన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో సందడిగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొని ఎంపీకి శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా రాష్ట్ర మౌలిక వసతుల కల్పనపై సమగ్ర కార్యాచరణను వివరించారు. రోడ్ల అభివృద్ధిని కేవలం ప్రయాణ సౌకర్యానికి పరిమితం చేయకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర ప్రగతికి అసలైన సూచికగా ప్రభుత్వం భావిస్తోంది. రోడ్ల నెట్‌వర్క్ ఎంత బలంగా ఉంటే మిగతా 2లో..



## మూసీ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్

- హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడం
- కాలుష్య నియంత్రణ, వరద సమస్యల శాశ్వత పరిష్కారం
- పేదలకు అన్యాయం జరగకుండా పారదర్శక భూసేకరణ
- నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల భరోసా
- భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం
- భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గట్టిగా పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరం రూపురేఖలు పూర్తిగా మారుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మూసీ నదికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రధాన ఉద్దేశ్యం. సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో మిగతా 2లో..

## కొత్త పెన్షన్లు లేనట్టేనా?

- పెన్షన్ పెంపు హామీ 30 నెలలుగా అమలు కాలేదు
- ఏరివేతల పేరుతో 1.87 లక్షల పెన్షన్లు రద్దు
- కొత్త లబ్ధిదారుల చేరికలో తీవ్ర జాప్యం
- పారదర్శకత లేక అర్హులకు అన్యాయం
- నిధుల పేరుతో పేదల సంక్షేమం విస్మరణ
- పెన్షన్ల రాజకీయీకరణపై లబ్ధిదారుల అసంతృప్తి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో పెన్షన్ల వ్యవహారం తీవ్ర సందిగ్ధంలో పడింది. అర్హులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేసే ప్రక్రియ అటకెక్కిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండున్నరేండ్ల కాలంగా ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును గమనిస్తే, కొత్త పెన్షన్ల పట్ల సర్కారు మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఆశలు కల్పించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించింది. ప్రజలు ఎదురుచూస్తున్న పెన్షన్ పెంపుదల, కొత్త దరఖాస్తుల ఆమోదంపై స్పష్టత కరువైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నా, అవి ఎప్పటికి అమలులోకి వస్తాయనే విషయంపై ఎటువంటి కార్యాచరణ కనిపించడం లేదు. పాలకులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు మధ్య భారీ అంతరం కనిపిస్తోంది. మొత్తంగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న పేద ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లు తయారైంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జాప్యం, సర్వేల పేరుతో జరుగుతున్న కాలయాపన ప్రభుత్వ నిజాయితీని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ పరిస్థితి పట్ల రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం కురిపించింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ వర్కర్లు, కల్లుగీత, చేనేత కార్మికులకు ఇస్తున్న మిగతా 3లో..

## భూ వివాదాల్లో పోలీసులు

- స్టేషన్లను సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చడం
- బెయిల్, కేసుల పేరుతో వసూళ్లు
- సివిల్, భూ వివాదాల్లో చట్టవిరుద్ధ జోక్యం
- తప్పు చేసిన అధికారులపై సస్పెన్షన్లు
- అక్రమాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు
- పారదర్శకతతో ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం

04



## కొడంగల్‌లో 11 వేల కర్ణాటక ఓట్లున్నయ్

- రేవంత్ రెడ్డి గెలుపులో ఈ అక్రమ ఓట్లు కీలకమని విమర్శ
- కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్, పరరాష్ట్ర ఓట్లు ఉన్నాయని ఆరోపణ
- ఓట్ల తొలగింపులో ఈసీ నిబంధనలు పాటించలేదని ఆగ్రహం
- ఇంటర్-స్టేట్ ఓట్ల ఏరివేతలో వ్యవస్థ లోపించిందని నిలదీత
- రూ.1400 కోట్ల ఎస్ఐఆర్ ప్రక్రియ నిష్ప్రయోజనమని విమర్శ
- 'వన్ ఓటు-వన్ నేషన్' అమలుతో పారదర్శక ఎన్నికలు కోరారు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: కొడంగల్ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఓటరు జాబితా అక్రమాలపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గెలుపు వెనుక భారీ డూప్లికేట్ ఓట్ల గోల్‌మాల్ ఉందని ఆమె పేర్కొన్నారు. కర్ణాటకలోని సెడం మిగతా 2లో..

## తెలంగాణకు ఏం చేశారో చర్చకు సిద్ధం

- వరంగల్ అభివృద్ధికి కేంద్రం రూ.17 వేల కోట్లు ఇచ్చింది
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, విమాన సేవలు త్వరలో ప్రారంభం
- అభివృద్ధిపై చర్చకు రావాలని విపక్షాలకు కిషన్ రెడ్డి పిలుపు
- ఉద్యోగులు, అధికారుల్లో బీజేపీ పాలనపై ఆసక్తి ఉంది

03






## సింగిరేణికి బాకీ

- జెన్‌కో, ట్రాన్స్‌కోల నుంచి రావాల్సిన బకాయిలు భారీగా పెరిగాయి
- సొంత రాష్ట్ర విద్యుత్ సంస్థలు సకాలంలో చెల్లింపులు చేయడం లేదు
- బయటి రాష్ట్రాల నుంచి వసూలు చేస్తున్నా, ఇక్కడ వసూళ్లు ఆగిపోయాయి
- నిధుల కొరతతో గనుల విస్తరణ, కొత్త ప్రాజెక్టులు స్తంభించాయి

03

## మూసి ప్రాజెక్ట్

# తెలంగాణ భవిష్యత్

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టు అమలుకు సంబంధించిన కీలక అంశాలు చర్చించారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఎండీ నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్లు ఈ చర్చల్లో భాగస్వాములు కావడమే కాకుండా భూ సేకరణ, పునరావాసం ప్రక్రియలను వేగవంతం చేసే బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర ప్రగతిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా మారుతుందని అందరూ ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘ లక్ష్యం. మూసి నదిని పునరుజ్జీవింపజేసి పర్యాటక, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుస్తామని మంత్రి వివరించారు. ఇది కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదు, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహిత జీవన వాతావరణం అందించే గొప్ప సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మూసి నది కాలుష్యంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా వర్షాకాలంలో వరదల సమయంలో పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను తొలగించాలనే లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టు రూపొందించారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ నది రూపురేఖలు మార్చడం ద్వారా కొత్త చరిత్ర సృష్టించాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. ఈ భారీ ప్రాజెక్టును పకడ్బందీగా అమలు చేసేందుకు ఉన్నతాధికారులందరినీ సమన్వయం చేసుకుంటూ, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అన్ని శాఖల భాగస్వామ్యంతో పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నది తీరంలో అందమైన రోడ్లు, ఆధునిక పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాల ఏర్పాటు ద్వారా పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించారు. దీనివల్ల నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం లభించడమే కాకుండా, పర్యాటకంగా నగరం మరింత అభివృద్ధి చెందుతుంది. మూసి గర్భంలో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి, నీటి ప్రవాహం సజావుగా సాగేలా చూడటమే మొదటి దశ ప్రణాళిక. పర్యావరణాన్ని కాపాడుకుంటూనే నగర అభివృద్ధిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. వందల ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే సమగ్ర సర్వేలు పూర్తి చేశారు. గ్రీన్ కారిడార్ల ఏర్పాటు ద్వారా నగరం ఊపిరి పీల్చుకునేలా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఆధునిక సాంకేతికతను జోడించి నది తీర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దడమే కాకుండా, నగరానికి అదనపు ఆకర్షణగా మార్చేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టారు. ఈ మార్పు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెడుతుంది. ముఖ్యమంత్రి గతంలోనే అనేకసార్లు స్పష్టం చేసినట్లుగా, ఈ మూసి ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. అభివృద్ధి, మానవీయతలను సమన్వయం చేస్తూ ముందుకు సాగడమే తమ విధానమని ఆయన తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు ఏమాత్రం దెబ్బతినకూడదని, ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం జరుగుతున్న ప్రతి కదలికలోనూ పారదర్శకత పాటిస్తున్నామని ఆయన చెప్పారు. భూ సేకరణ ప్రక్రియలో ప్రజల ప్రయోజనాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చట్టపరమైన నిబంధనలను అనుసరిస్తూనే, బాధిత ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాలని మంత్రి కోరారు. ప్రాజెక్టు సక్సెస్ కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, వారి నమ్మకాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగాలని ఆయన అధికారులను ప్రోత్సహించారు. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇళ్లు కోల్పోయే ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు తక్షణమే కార్యాచరణ రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అర్హులైన వారికి ఇళ్లు కల్పించే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన కోరారు. పునరావాస కార్యక్రమాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకూడదని, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం అందజేయడంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదు. అన్ని రకాల వసతులతో కూడిన పునరావాస కాలనీలను నిర్మించి, వారికి మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రక్రియలో అధికారులు చొరవ చూపి, బాధిత ప్రజలతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ప్రభుత్వం వారి వెంటే ఉందని భరోసా కల్పించడం ద్వారా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయవచ్చని మంత్రి చెప్పారు. పారదర్శకమైన విధానం ద్వారానే సమస్యలను అధిగమించగలమని, మానవీయ కోణంలో సమస్యలను పరిష్కరించడం ద్వారా సామాజిక అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని ఆయన వివరించారు. భూ సేకరణ, పునరావాస అంశాలపై అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్లకు ఈ విషయంలో ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రాజెక్టు విజయవంతం కావాలంటే అధికారుల నిబద్ధత చాలా ముఖ్యమని ఆయన గుర్తుచేశారు. పనుల్లో జాప్యం లేకుండా చూసుకోవడం ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న నమ్మకం పెరుగుతుందని ఆయన వివరించారు. నిర్ణీత లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన వనరులను సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి హామీ ఇచ్చారు.





# ఏడాది గడిచినా తీరని బాధ

మొదటిపేజీ తరువాయి

కార్మికుల ప్రాణాలకు విలువ లేని పారిశ్రామిక వాతావరణం పట్ల సమాజం ఆగ్రహం వ్యక్తం చేసింది. శిథిలాల నుంచి వెలికితీసిన మృతదేహాలు, వారి కుటుంబాల ఆవేదన చూసి ప్రతి ఒక్కరూ చలించిపోయారు. ఘటన జరిగిన ప్రాంతం నేటికీ ఆనాటి విషాద దృశ్యాలను గుర్తుచేస్తోంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం, సిగాచి యాజమాన్యం ఆనాడు ప్రకటించాయి. అయితే ఆ హామీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని బాధిత కుటుంబాలు, కార్మిక సంఘాలు ఆవేదన చెందుతున్నాయి. ఇప్పటివరకు 54 కుటుంబాలకు కలిపి రూ.24.51 కోట్లు మాత్రమే చెల్లించగా, ఒక్కో కుటుంబానికి సగటున రూ.45 లక్షల వరకు మాత్రమే అందాయని సమాచారం. కంపెనీ చెల్లించిన పరిహారంలో పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ వంటి చట్టబద్ధ ప్రయోజనాలను కూడా కలిపి చూపించారని కార్మికులు ఆరోపిస్తున్నారు. గాయపడిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా కంపెనీ పూర్తిగా భరించలేదని వారు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు కాగితాలకే పరిమితం కావడం పట్ల బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం ఆడుకుంటోందని విమర్శలు వస్తున్నాయి. పరిహారం విషయంలో జరిగిన జాప్యం బాధిత కుటుంబాలను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది. చట్టబద్ధమైన హక్కులను కూడా పరిహారంలో భాగం చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులకు న్యాయం జరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ప్లాంటులో మూడు షిఫ్టులు కలిపి మొత్తం 250 నుంచి 300 వరకు కార్మికులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేసేవారు. లేబర్ కాంట్రాక్టర్ ద్వారా రోజువారీ పనికి కార్మికులు వచ్చేవారు. ప్రమాదం అనంతరం సిగాచి పరిశ్రమ మూతపడింది. వందలాది మంది శాశ్వత, కాంట్రాక్ట్, రోజువారీ కార్మికులు ఒక్కసారిగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రస్తుతం పరిశ్రమకు సంబంధించిన వివిధ కేసులు కోర్టుల్లో ఉన్నాయి. ప్రమాదం జరగడంతో ఉపాధి కోల్పోయిన వారంతా ఇప్పుడు జీవనోపాధి కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. పరిశ్రమ మూతపడటంతో స్థానిక ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడింది. కార్మికుల కుటుంబాలు తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయి. పరిశ్రమ పునరుద్ధరణపై స్పష్టత లేకపోవడం, న్యాయస్థానాల్లో కేసులు కొనసాగుతుండటంతో కార్మికులు అయోమయంలో ఉన్నారు. ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ మార్గాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కంపెనీ యాజమాన్యం కార్మికుల సంక్షేమం పట్ల కనీస బాధ్యత కూడా వహించలేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఉపాధి లేక కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. సిగాచి ప్రమాదం తర్వాత పరిశ్రమల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తాయి. యాజమాన్యాల నిర్లక్ష్యం, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, భద్రతా ప్రమాణాల అమలులో వైఫల్యం చివరకు అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకున్నాయి. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా పరిశ్రమల్లో భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది. పారిశ్రామికాభివృద్ధిలో భద్రతను విస్మరించడం వినాశకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠినమైన జరిమానాలు విధించాలి. కార్మికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పారిశ్రామిక రంగంలో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలతో పాటు ప్రభుత్వాలపై కూడా ఉంది. భద్రతా లోపాలను గుర్తించి సరిదిద్దడం ద్వారా మాత్రమే ఇలాంటి ప్రమాదాలను అరికట్టగలం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సిగాచి ప్రమాదంపై విచారణ జరిపిన హైపవర్, నిపుణుల కమిటీలు పరిశ్రమలో తీవ్ర భద్రతా లోపాలు ఉన్నట్లు తమ నివేదికల్లో స్పష్టం చేశాయి. సామర్థ్యానికి మించి యంత్రాలు ఏర్పాటు చేయడం, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ సరిగా లేకపోవడం వంటి అంశాలను కమిటీలు గుర్తించాయి. ఈ లోపాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి కారణమని నివేదికలు స్పష్టం చేశాయి. పరిశ్రమలో 818 హెచ్‌పీ సామర్థ్యానికి మాత్రమే అనుమతి తీసుకోగా, అక్రమంగా 1,777 హెచ్‌పీకి యంత్రాలను పెంచేశారు. వందలాది మంది కార్మికులు పనిచేసే చోట కనీస భద్రతా ప్రమాణాలు లేవు. సేఫ్టీ గార్డ్స్ లేవు, ఫైర్ ఎన్‌ఓసీ లేదు, డస్ట్ కంట్రోల్ సిస్టమ్ అస్సలు పనిచేయలేదు. పర్యవేక్షించాల్సిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు నిర్లక్ష్యం వహించారు. ప్రమాదం జరిగి ఏడాది పూర్తవుతున్నా, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు జరిగాయి. ఘటనపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. గతంలో వివిధ ప్రభుత్వ శాఖల నుంచి భద్రతా అనుమతులు, ఎన్‌ఓసీలు పొందామని, పరిశ్రమలో లోపాలేవీ లేవని సంబంధిత శాఖలే ధ్రువీకరించాయని సిగాచి యాజమాన్యం వాదిస్తోంది. కంపెనీకి చెందిన పలువురిపై కేసులు నమోదుకాగా, సంస్థ సీఈఓ అమిత్ రాజ్ సిన్హా అరెస్టైన అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి, సిగాచీ యాజమాన్యం ప్రకటించాయి. కేవలం రూ.45 లక్షల చొప్పున సుమారు 24.5 కోట్లు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.55 లక్షల చొప్పున 29.5 కోట్లను ప్రభుత్వం చెల్లించాలని కంపెనీ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 54 కుటుంబాలకు ఇంకా రూ.29.5 కోట్లకు పైగా పెండింగ్ పరిహారం అందాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే మిగిలిన పరిహారం చెల్లించాలి. విచారణ కమిటీ నివేదికను, పారిశ్రామిక తనిఖీల ఫలితాలను విడుదల చేయాలి. హైకోర్టులో పిల్‌ను అత్యవసరంగా విచారించాలి. బాధ్యులపై క్రిమినల్ కేసులు వేగంగా సాగాలి. కార్మికుల కుటుంబాలకు ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ క్లెయిమ్‌లను కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలి.

# హ్యామ్ రోడ్లతో మారనున్న తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఆర్థిక వ్యవస్థ అంత వేగంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి నొక్కి చెప్పారు. ఎక్కడైతే నాణ్యమైన రహదారులు ఉంటాయో అక్కడ పరిశ్రమల స్థాపనకు ఎక్కువ అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తద్వారా స్థానిక యువతకు, నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా ప్రాంతీయ ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ఈ రహదారులు తెలంగాణా భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక మార్గాలుగా మారుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభం కానున్న ఈ హ్యామ్ ప్రాజెక్టుకు నల్లగొండ జిల్లాలోని కనగల్ మండల కేంద్రంలో పైలాన్‌ను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టుల శరవేగంగా పూర్తి చేయడంలో ఈ విధానం ఎంతో కీలకమని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు శాఖ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు అందడమే కాకుండా రవాణా ఖర్చులు కూడా భారీగా తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు ప్రయాణికులకు మరింత భరోసానిస్తాయని మంత్రి వెల్లడించారు. రహదారుల అనుసంధానంలో భాగంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు ఫోర్ లైన్ రహదారి కోసం ఇప్పటికే టెండర్లు పిలిచామని మంత్రి వెల్లడించారు. ఈ మార్గం పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా మరింత సుగమం అవుతుందని ఆయన వివరించారు. గుర్రంపోడ్ దాటిన తర్వాత 3 కిలోమీటర్ల పక్క నుంచి అమరావతి, బందర్ మీదుగా వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ సిటీ హైవే డీపీఆర్ ప్రక్రియ పూర్తయ్యిందని, ప్రస్తుతం అది టెండర్ల దశలో ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నగరం నుంచి కీలక ప్రాంతాలకు రవాణా సమయం గణనీయంగా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించారు. అటవీ ప్రాంతం కావడంతో పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశమని ఆయన చెప్పారు. మరో మూడు నెలల్లో దీని డీపీఆర్ ఫైనల్ కానుందని, వెంటనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. క్యాబినెట్ ఆమోదం పొందిన మరుక్షణమే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల పర్యాటక రంగం కూడా మరింత పుంజుకుంటుందని ఆయన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభ ఊహించని రీతిలో విజయవంతమైందని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు, మహిళలు భారీగా తరలివచ్చి తమ ఆదరాభిమానాలను చాటుకున్నారని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి పాల్గొన్న ఈ సభలో ప్రజల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై స్పష్టత ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ సభను ఘన విజయం చేసినందుకు ఉమ్మడి జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతు మరింత బాధ్యతను పెంచుతోందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ కీలక సమావేశంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, కుందూరు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేశ్ పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ ముఖ్య నేతలు అధిక సంఖ్యలో హాజరై ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. పార్టీ నాయకులందరి సమన్వయంతో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన కేవలం ఇప్పటి అవసరాల కోసమే కాకుండా భవిష్యత్తు తరాలకు మేలు చేసేలా ఉంటుందని మంత్రి నొక్కి చెప్పారు. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలు ఏపుగా పెరగాలంటే రహదారి వ్యవస్థ పునాదిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కొన్ని ప్రాంతాలు వెనుకబడిపోయాయని, ఇప్పుడు వాటిని ప్రధాన స్రవంతిలోకి తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ప్రాజెక్టును పారదర్శకంగా, నాణ్యతతో నిర్మించేందుకు తమ శాఖ కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణాల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా కఠిన చర్యలు తీసుకునేలా పర్యవేక్షణ ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం అమల్లోకి తెస్తున్న హ్యామ్ విధానం వల్ల ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు వేగంగా పూర్తవుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల సమన్వయం వల్ల నిధుల కొరత లేకుండా ప్రాజెక్టులు సాగుతాయని ఆయన చెప్పారు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి భారం తగ్గడమే కాకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని మంత్రి వెల్లడించారు. రానున్న ఐదేళ్ల కాలంలో తెలంగాణ రోడ్ల వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా సహకారం తీసుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి వెంకటరెడ్డి పునరుద్ఘాటించారు. చివరిగా మాట్లాడిన మంత్రి నల్లగొండ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, తన నియోజకవర్గంతో పాటు జిల్లా అంతటా మౌలిక వసతుల కల్పనలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలవడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నల్లగొండ జిల్లా రూపురేఖలు పూర్తిగా మారుతాయని, ఆనందకరమైన ప్రయాణ సౌకర్యాలు ప్రజలకు అందుతాయని మంత్రి ముగించారు. ఎంపీ కార్యాలయం ప్రారంభోత్సవం ద్వారా జిల్లా రాజకీయాల్లో నూతన అధ్యాయం మొదలైందని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషికి ప్రజలందరూ సహకరించాలని మంత్రి కోరారు.



# కొడంగల్‌లో 11 వేల కర్ణాటక ఓట్లున్నయ్

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గ పరిధిలో ఉన్న 11 వేల మంది ఓటర్లు అదే సమయంలో కొడంగల్‌లో కూడా ఓటర్లుగా నమోదై ఉండటం విడ్డూరమని విమర్శించారు. కేవలం అక్రమ ఓట్ల కలయికతోనే రేవంత్ రెడ్డి 33 వేల మెజారిటీ సాధించారని ఆమె గణాంకాలతో వివరించారు. రాష్ట్ర సరిహద్దుల గుండా ఓట్లు, డబ్బులు పెద్ద ఎత్తున తరలించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలి పట్ల కవిత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొడంగల్‌లో 22,433 డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని ఆమె వెల్లడించారు. 2018తో పోలిస్తే 2023 నాటికి ఓట్ల సంఖ్య అనూహ్యంగా 30 వేల మేర పెరగడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిన్నర వ్యవధిలో 7 వేల ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే నియోజకవర్గంలో 2 శాతం కంటే ఎక్కువ ఓట్లు తొలగించాల్సి వస్తే, సంబంధిత ఓటర్లకు మూడు సార్లు నోటీసులు జారీ చేయాలనే నిబంధనను ఈసీ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. కానీ కొడంగల్‌లో కేవలం 808 ఓట్లను మాత్రమే తొలగించడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని నిలదీశారు. బోధన్‌లో తొలగించిన 7 వేల ఓటర్లు అసలు ఎక్కడికి వెళ్లారో ఈసీ స్పష్టత ఇవ్వాలి. ప్రకాష్‌రాజ్ వంటి వ్యక్తుల ఓట్ల తొలగింపునకు ఏడు ఏళ్ల సమయం పట్టగా, బోధన్‌లో ఇంత వేగంగా ఎలా తొలగించారని ప్రశ్నించారు. నిబంధనల అమలులో ఉన్న ఈ ద్వంద్వ ప్రమాణాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆమె ఆందోళన చెందారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో ఎన్నికల కమిషన్ పారదర్శకతను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని ఆమె స్పష్టం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణలో కూడా పలు లోపాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. రిఫరెన్స్ పాయింట్ విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కన పెట్టి, 2025 జనవరి నుంచి గణాంకాలు తీసుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని కవిత ప్రశ్నించారు. ఏటా నిర్వహించే ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో అనుసరించే పద్ధతిని ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఈ విధానం వల్ల అసలైన ఓటర్ల జాబితా తయారీకి విఘాతం కలుగుతుందని ఆరోపించారు. కేవలం ఒక నియోజకవర్గంలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో భారీ అక్రమాలు జరిగినట్లు తమ పరిశోధనలో తేలిందని తెలిపారు. సుమారు 1400 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి చేపడుతున్న ఈ ప్రక్రియ వల్ల సామాన్య ఓటరుకు ఒరిగేది ఏమిటని ప్రశ్నించారు. నిధుల దుర్వినియోగం కాకుండా, అర్హత కలిగిన ఓటర్ల వివరాలు మాత్రమే నమోదు కావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ అక్రమాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆమె ఈసీని సూటిగా అడిగారు. దేశవ్యాప్తంగా డూప్లికేట్ ఓట్లను నివారించేందుకు ఒక సమర్థవంతమైన వ్యవస్థ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. సంచార జాతుల ప్రజలకు ఓటు హక్కు కల్పించే విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని కోరారు. ఒక ఇంట్లో నివసించే కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు ఉండేలా చర్యలు తీసుకోవడం ద్వారా గందరగోళం తొలగిస్తుందని ఆమె సూచించారు. అంతర్రాష్ట్ర ఓట్ల డూప్లికేషన్ అరికట్టేందుకు ఈసీ వద్ద ఎటువంటి మెకానిజం లేకపోవడం విచారకరమని విమర్శించారు. కేవలం ఒక రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా వన్ నేషన్, వన్ ఎలక్షన్, వన్ ఓటు అనే పద్ధతిని తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె గట్టిగా వాదించారు. లేనిపక్షంలో ఎన్నికల నిర్వహణకు ఖర్చు చేసే వందల కోట్ల నిధులు వృథా అవుతాయని పేర్కొన్నారు. అక్రమ ఓట్ల నమోదు ద్వారా గెలుపోటములను ప్రభావితం చేసే ధోరణికి చెక్ పెట్టాలని కోరారు. ఇటువంటి వ్యవస్థాత్మక లోపాలు ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆమె హెచ్చరించారు. ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడంపై ఆమె తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తాము లేవనెత్తిన ప్రతి అంశంపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఓటరు జాబితా క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాలని, అక్రమ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు ఉండాలంటే ఓటర్ల జాబితా నిష్పక్షపాతంగా ఉండాలని ఆమె నొక్కి చెప్పారు. కొడంగల్, బోధన్ నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న ఈ అక్రమాలు ఐస్‌బర్గ్ కొన మాత్రమేనని ఆమె విశ్లేషించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంటే ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లోనైనా ఇటువంటి పొరపాట్లు జరగకుండా ఈసీ కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈసీ తీసుకునే చర్యలు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఉండాలని కవిత సూచించారు. దేశంలో ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికల నిర్వహణ కోసం తాము నిరంతరం కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఇటువంటి అక్రమాలను ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత హెచ్చరించారు. నిష్పక్షపాతమైన ఓటరు జాబితా తయారీ కేవలం ఒక రాజకీయ అవసరమే కాదు, ప్రజాస్వామ్య పరిరక్షణకు అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. డూప్లికేట్ ఓట్ల ఉనికిని నిర్ధారించేందుకు తాము ప్రింట్ తీసిన వెయ్యి ఓట్ల జాబితా ఒక చిన్న నిదర్శనం మాత్రమేనని చెప్పారు. ఇంటర్ స్టేట్ మైగ్రేషన్ అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని ఆమె ఈసీకి విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పినట్లుగా ఇతర దేశాల ఓటర్ల తొలగింపు అవసరమే అయితే, అంతర్రాష్ట్ర డూప్లికేషన్ ఓటర్ల విషయం కూడా అదే స్థాయిలో చూడాలని ఆమె వాదించారు. ఒక రాష్ట్రంలో వేరే దేశ పౌరుడి ఓటు తొలగిస్తే, వారు మరో రాష్ట్రంలో నమోదు చేసుకునే ప్రమాదం ఉందని ఆమె విశ్లేషించారు. దీన్ని నివారించేందుకు ఒక డేటాబేస్ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



# తెలంగాణకు ఏం చేశారో చర్చకు సిద్ధం

- వరంగల్ అభివృద్ధికి కేంద్రం రూ.17 వేల కోట్లు ఇచ్చింది
- రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, విమాన సేవలు త్వరలో ప్రారంభం
- అభివృద్ధిపై చర్చకు రావాలని విపక్షాలకు కిషన్ రెడ్డి పిలుపు
- ఉద్యోగులు, అధికారుల్లో బీజేపీ పాలనపై ఆసక్తి ఉంది
- రాష్ట్ర ప్రగతి కోసం బీజేపీ గెలుపు అవసరం
- ఎన్నికల లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వరంగల్ వేదికగా జరిగిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనం రాజకీయంగా కీలక మలుపుగా మారింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పై సవాళ్ల వర్షం కురిపించారు. వరంగల్ అభివృద్ధి విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. నగర సమగ్ర ప్రగతికి తమ ప్రభుత్వం 17,000కోట్ల రూపాయల భారీ నిధులను కేటాయించిందని గణాంకాలతో సహా వివరించారు. రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొడుతూ అభివృద్ధిపై చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలోని అమరవీరుల స్థూపం సాక్షిగా ఎవరి పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో లెక్కలు తేల్చుకుందామని డిమాండ్ చేశారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఈ భారీ బహిరంగ సభలో బీజేపీ అగ్రనేతలు హాజరై శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా దిశానిర్దేశం చేశారు. వరంగల్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమని నేతలు పునరుద్ఘాటించారు. ఉత్తర, దక్షిణ భారత్ అనుసంధాన నగరంగా వరంగల్ రూపుదిద్దుకుంటుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వరంగల్ కు మంజూరు చేసిన ప్రాజెక్టుల వివరాలను ఆయన సాక్ష్యాలతో సహా బయటపెట్టారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం మంజూరు చేయడం వరంగల్ ప్రజలకు గొప్ప వరం అన్నారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే వరంగల్ ఎయిర్ పోర్ట్ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభం కానున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది విమాన సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆ విమాన ప్రయాణం తనతోనే మొదలవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేయడమే తమ విధానమని ఆయన స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనలో కేంద్రం తీసుకుంటున్న చొరవ వల్ల వరంగల్ ఆర్థికంగా మరింత బలపడుతుందని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. నిధుల కేటాయింపు పారదర్శకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో మార్పు కోసం సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ యంత్రాంగం కూడా వేచి చూస్తోందని కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రెవెన్యూ విభాగం సిబ్బంది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయ వర్గాలు కూడా బీజేపీ పాలనను ఆకాంక్షిస్తున్నాయని ఆయన తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం లేకపోవడం వల్లే ప్రభుత్వ ఉద్యోగులు విసిగిపోయారని ఆయన విశ్లేషించారు. అవినీతిమయమైన పాలన నుండి విముక్తి కోసం అంతా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించే సర్వే ప్రక్రియపై సీఎం రేవంత్, మజ్లిస్ పార్టీ నేతలు ఎందుకు భయాందోళనకు గురవుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల నాడిని పసిగట్టినందుకే వారు ఉలిక్కిపడుతున్నారని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. నిజాయితీ గల పాలన అందివ్వడమే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. అధికార పీఠం ఎక్కిన తర్వాత రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేస్తామని, అక్రమాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రధాని మోదీ హామీ ఇస్తే అది కచ్చితంగా అమలు జరుగుతుందనే బలమైన నమ్మకం ప్రజల్లో ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలాగా ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మభ్యపెట్టే సంస్కృతి తమకు లేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పని చేస్తున్న ఈ రెండు పార్టీలను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కిషన్ రెడ్డి నొక్కి చెప్పారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే కేంద్రం, రాష్ట్రం ఒకే తాటిపై ఉండాలని ఆయన వాదించారు. మోదీ నాయకత్వంలోని కేంద్రం రాష్ట్రానికి వేల కోట్ల నిధులు ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర పథకాలు ప్రజలకు చేరకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నాయని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ద్వారా అసెంబ్లీ ఎన్నికలకు పునాది పడుతుందని ఆయన స్పష్టం చేశారు. బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్టం చేయాలని కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ లో బీజేపీని గెలిపించే బాధ్యత కార్యకర్తలదేనని పేర్కొన్నారు. ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. వరంగల్ లో కాషాయ జెండా ఎగురవేసే సమయం ఆసన్నమైందని ఆయన శ్రేణులను ఉద్దేశించి ఉద్ఘాటించారు. కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని కోరారు. పార్టీ అధిష్టానం నిర్దేశించిన కార్యాచరణను అమలు చేస్తూ ప్రజలకు దగ్గర కావాలని సూచించారు. కార్యకర్తల కష్టమే పార్టీ విజయానికి ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలని కిషన్ రెడ్డి కోరారు. వరంగల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలను కలుపుకుని బీజేపీని అధికారంలోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు వస్తాయని వారు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవడానికి ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని, కానీ ప్రజలు మాత్రం మోదీ వైపు ఉన్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రాధాన్యతని వారు నొక్కి చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మాట్లాడుతూ, పార్టీని బలోపేతం చేసేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేస్తేనే విజయం సాధ్యమవుతుందని అన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే పార్టీగా బీజేపీని నిలబెడతామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న పనులను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ జెండా రెపరెపలాడటం ఖాయమని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన వేలాది మంది కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే మార్పు తథ్యమని స్పష్టమవుతోంది. కిషన్ రెడ్డి విసిరిన సవాల్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వరంగల్ వేదికగా జరిగిన ఈ సమ్మేళనం జిల్లా రాజకీయాల్లో సెగలు రేపుతోంది. అమరవీరుల స్థూపం వద్దకు రావాలన్న సవాల్‌పై అధికార పార్టీల మౌనం చర్చనీయాంశమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వారు చర్చకు రావడం లేదని బీజేపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. వరంగల్ అభివృద్ధి విషయంలో నిజనిర్ధారణ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో బీజేపీ బలపడుతుండటంతో ఇతర పార్టీలు అప్రమత్తం కావాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, అమలు చేస్తున్న ప్రాజెక్టులపై ప్రజల్లో అవగాహన పెరిగింది. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు కోసం రాష్ట్రం ఆసక్తిగా వేచి చూస్తోంది. బీజేపీ ఆశాభావం నిజమవుతుందో లేదో వేచి చూడాలి.

## ప్రభుత్వ ఉద్యోగులకు డబుల్ బొనాంజా

**మొదటిపేజీ తరువాయి**



పెద్దపీట వేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులతో జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. వంద రోజుల్లో ఆరు వేల కోట్ల రూపాయల బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని ప్రభుత్వం గట్టిగా ప్రకటించిన సంగతి విదితమే. ఈ క్రమంలోనే గత నెల 29న మొదటి విడతలో రెండు వేల కోట్ల రూపాయలను విడుదల చేసి తన నిబద్ధతను చాటుకుంది. క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల మధ్య కూడా ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న ఈ సానుకూల దృక్పథం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తాజాగా రెండో విడతలో మరో రెండు వేల కోట్ల రూపాయలను విడుదల చేయడంతో, బకాయిల చెల్లింపు ప్రక్రియ వేగవంతమైంది. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం ఈ దఫా ప్రత్యేక దృష్టిసారించింది. సుదీర్ఘ కాలంగా తమకు రావలసిన సొమ్ముల కోసం ఎదురుచూస్తున్న పదవీ విరమణ పొందిన వారికి ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తోంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం క్లియర్ చేయడంలో ఆర్థిక శాఖ అసాధారణ వేగంతో పని చేసింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జడ్పీ ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలు ఇప్పుడు బకాయిల భారం లేకుండా శుభ్రపడ్డాయి. రిటైర్డ్ ఉద్యోగులందరికీ చెందాల్సిన జీపీఎఫ్ నగదు పూర్తిగా జమ కావడంతో వారు ఆర్థికంగా కొంత ఉపశమనాన్ని పొందారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిల విషయంలో కూడా ప్రభుత్వం సుదీర్ఘకాలంగా ఉన్న ఇబ్బందులను తొలగించింది. సెప్టెంబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిల మొత్తాన్ని వంద శాతం పూర్తిగా చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చే పరిస్థితిని మార్చేసి, వేగవంతంగా నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం పట్ల పెన్షనర్ల సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. ఈ ప్రక్రియ వల్ల వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు తమ వైద్య, ఇతర అత్యవసర ఖర్చుల కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం తప్పింది. చిన్న మొత్తాల బిల్లుల విషయంలో కూడా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించింది. ట్రెజరీలో పేరుకుపోయిన పది వేల రూపాయల లోపు విలువ కలిగిన చిన్న బిల్లులను పరిష్కరించడం ద్వారా సామాన్య ఉద్యోగులకు సైతం మేలు చేసింది. ఏకంగా ఐదు లక్షలకు పైగా టోకెన్లను గుర్తించి, ఒక్కసారిగా నిధులను విడుదల చేయడం ద్వారా వ్యవస్థలో నెలకొన్న జాప్యాన్ని తొలగించింది. ఈ బిల్లులు పాతబడకుండా వెంటనే పరిష్కారం కావడంతో క్షేత్రస్థాయి ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పర్యవేక్షణలో ఈ నిధుల విడుదల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోంది. ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని క్రమపద్ధతిలో బకాయిలను చెల్లిస్తున్న ప్రభుత్వ తీరుపై ఉద్యోగ సంఘాలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగులు వెన్నెముక వంటివారని గుర్తించిన ఈ సర్కార్, వారిని గౌరవించే క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. ఆయా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సైతం ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరించాలని కోరుతున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన ఈ నిధుల వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులలో పనితీరు మెరుగుపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల గతంలో అనేకమంది ఉద్యోగులు ఆందోళన చెందేవారు, కానీ ఇప్పుడు ప్రభుత్వం తీసుకుంటున్న చొరవతో అటువంటి పరిస్థితి మారుతోంది. బిల్లుల చెల్లింపులో ఉన్న జాప్యాన్ని తగ్గించడం వల్ల పరిపాలనాపరమైన పనులు కూడా వేగవంతం అవుతున్నాయి. ట్రెజరీ కార్యాలయాల్లో పాత బిల్లుల భారం తగ్గడంతో, సిబ్బంది కొత్త పనులపై దృష్టి సారించే అవకాశం ఏర్పడింది. ఈ ప్రక్రియలో సాంకేతికపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు ఆర్థిక శాఖ ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ సదుపాయాలను మెరుగుపరిచింది.

## కొత్త పెన్షన్లు లేనట్టేనా?

**మొదటిపేజీ తరువాయి**



పెన్షన్‌ను నెలకు 2,016 రూపాయల నుంచి 4,000 రూపాయలకు రెట్టింపు చేస్తామని ప్రకటించింది. దివ్యాంగులకు అందజేసే పెన్షన్‌ను 4,016 రూపాయల నుంచి 6,000 రూపాయలకు పెంచుతామని నమ్మబలికింది. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు క్షేత్రస్థాయిలో పదే పదే ఈ హామీలను పునరుద్ఘాటిస్తున్నప్పటికీ, రెండున్నరేండ్లుగా ఈ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పెన్షన్ పెంపుదల అంశం పూర్తిగా పక్కకు వెళ్లిపోయిందని చెప్పవచ్చు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతూ ప్రభుత్వం ఈ కీలక హామీని దాటవేస్తున్నట్లు కనిపిస్తోంది. సామాన్య ప్రజలు ఈ పెంపు కోసం నిరీక్షిస్తున్నా, ప్రభుత్వం మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడిచినా, పెన్షన్ పెంపుపై కనీసం ఒక ప్రకటన కూడా లేకపోవడం గమనార్హం. ఇది హామీ ఇచ్చిన పార్టీ పట్ల ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగిస్తోంది. గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం పెన్షన్లను కట్ చేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. 2024 2025 నాటికి రాష్ట్రంలో మొత్తం 43,15,981 మంది లబ్ధిదారులు పెన్షన్లు అందుకునేవారు. ప్రభుత్వం చేపట్టిన ఏరివేత కార్యక్రమాల వల్ల ఆ సంఖ్య ఈ ఏడాది మే 1 నాటికి 41,48,431కి పడిపోయింది. అంటే దాదాపు 1,67,550 పెన్షన్లను సర్కారు కట్ చేసింది. ఆ తర్వాత మే, జూన్ నెలల్లో జరిగిన మరో దఫా తొలగింపు ప్రక్రియలో మరో 20 వేల మందిని తొలగించారు. ఫలితంగా జూన్ నెలలో కేవలం 41,20,000 మందికి మాత్రమే పెన్షన్ అందజేశారు. మొత్తంగా చూస్తే, గత కొద్ది కాలంలోనే దాదాపు 1,87,550 పెన్షన్లు తొలగించబడ్డాయి. ఇది భారీ సంఖ్య కావడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. సరైన కారణాలు చూపకుండానే పెద్ద సంఖ్యలో పెన్షన్లను తొలగించడంపై విమర్శలు వస్తున్నాయి. అర్హులైన వారు కూడా ఈ తొలగింపుల్లో బాధితులుగా మారుతున్నారు. దీనివల్ల వృద్ధులు, వితంతువులు వంటి బలహీన వర్గాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఏరివేతల వైపే మొగ్గు చూపుతోంది. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో కూడా భారీగా ఏరివేతలు జరుగుతున్నాయి. పోస్టాఫీసు ద్వారా పెన్షన్ పొందుతున్న 19 లక్షల మంది లబ్ధిదారులలో సుమారు 16 లక్షల మంది సర్వేను ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ సర్వేలో 93,624 మందిని అనర్హులుగా నిర్ధారించారు. 40,751 మంది మరణించగా, 41,689 మంది ఆచూకీ తెలియరాలేదు. 11 వేల మందికి ఆధార్ కార్డులు చెల్లడం లేదు. సుమారు 3,475 మంది వలస వెళ్లినట్లు తేలింది. మే, జూన్ నెలల్లో జరిగిన ఏరివేతలో గ్రామ స్థాయిలో దాదాపు 1,70,000 మందిని పెన్షన్ జాబితా నుంచి తొలగిస్తూ జాబితా రూపొందించారు. అయితే వలస వెళ్లిన వారు, అందుబాటులో లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవడంతో కొంతమందిని మళ్ళీ చేర్చారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులు, ఐదు ఎకరాల కంటే ఎక్కువ వ్యవసాయ భూమి ఉన్నవారు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు వంటి వారిని ఈ జాబితా నుంచి తొలగించారు. ఈ సర్వే ప్రక్రియపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వం పెన్షన్ల విషయంలో అనుసరిస్తున్న తీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులకు, వితంతువులకు పెన్షన్లు పెంచుతామని పదే పదే చెబుతున్నా, ఆచరణలో మాత్రం శూన్యం. ప్రస్తుతం పెన్షన్లు అందుకుంటున్న 41,48,431 మందిలో కేవలం 19 లక్షల మందిని మాత్రమే ప్రభుత్వం స్క్రూటినీ చేసింది. డైరెక్ట్ క్యాష్ తీసుకుంటున్న మిగతా లబ్ధిదారుల అర్హతను కూడా తేల్చాల్సి ఉంది. భవిష్యత్తులో రాబోయే మున్సిపల్ ఎన్నికలు, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థనలు వస్తే తప్ప, ప్రభుత్వం పెన్షన్లపై ఎటువంటి సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నా, సచివాలయంలో ఈ పెన్షన్ల పెంపు లేదా కొత్త మంజూరుపై ఇప్పటివరకు ఎటువంటి నిర్దిష్ట కార్యాచరణ రూపొందలేదు. అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు జారీ కాలేదు. ఇది కేవలం కాలయాపన కోసం చేస్తున్న ప్రయత్నమని ప్రజలు భావిస్తున్నారు. హామీలను అమలు చేయడంలో ఉన్న జాప్యంపై ప్రజాక్షేత్రంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందో లేదో చూడాలి. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త పెన్షన్లు ఇవ్వాల్సి వస్తే, ప్రభుత్వం ఒక ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు తొలగించిన సుమారు 1,80,000 పెన్షన్ల స్థానంలో కొత్తగా దివ్యాంగులకు, వితంతువులకు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఇది కేవలం సర్దుబాటు ప్రక్రియగా మిగిలిపోయే అవకాశం ఉంది తప్ప, కొత్తగా లబ్ధిదారులను చేర్చుకునే ఉద్దేశం సర్కారుకు ఉన్నట్లు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం గమనించడం లేదు. నిజమైన అవసరమున్న పేదలను ఆదుకోవడంలో సర్కారు విఫలమవుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, కనీసం ప్రస్తుతం ఉన్న వారిని కూడా తొలగించే పనిలో ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఏరివేత ప్రక్రియలు, పెండింగ్ దరఖాస్తుల విషయంలో పారదర్శకత లోపించింది. అర్హులైన వారు కూడా పెన్షన్ కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. గత రెండున్నరేండ్లుగా పెన్షన్ పెంపుదలపై హామీలు మినహా, ఆచరణలో ఎటువంటి ప్రగతి లేదు. ప్రజలు ఈ హామీల అమలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ సర్వేలు, తొలగింపు ప్రక్రియల వల్ల ప్రజల్లో భయం నెలకొంది. తమ పెన్షన్ ఎప్పుడు తొలగిస్తారో తెలియని ఆందోళన సామాన్యుల్లో ఉంది. కనీసం పెన్షన్ పెంపుదల జరగకపోయినా, ప్రస్తుతం వస్తున్న వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

# సింగరేణికి బాకీ

- జెన్‌కో, ట్రాన్స్‌కోల నుంచి రావాల్సిన బకాయిలు భారీగా పెరిగాయి
- సొంత రాష్ట్ర విద్యుత్ సంస్థలు సకాలంలో చెల్లింపులు చేయడం లేదు
- బయటి రాష్ట్రాల నుంచి వసూలు చేస్తున్నా, ఇక్కడ వసూళ్లు ఆగిపోయాయి
- నిధుల కొరతతో గనుల విస్తరణ, కొత్త ప్రాజెక్టులు స్తంభించాయి
- వరుస ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణ లోపం వల్ల సంస్థకు నష్టం
- సింగరేణిని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే బాకీలు చెల్లించాలి




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా అనేది నిరంతర చర్చనీయాంశం. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విద్యుత్ వెలుగులను తమ ఘనతగా చెప్పుకుంటున్నాయి. అయితే ఈ వెలుగుల వెనుక ఉన్న సింగరేణి కాలరీస్ కష్టాలు ఎవరూ గుర్తించడంలేదు. సింగరేణి సంస్థ బొగ్గును సరఫరా చేస్తున్నా, తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు సకాలంలో చెల్లింపులు చేయడం లేదు. ఈ నిర్లక్ష్యం వల్ల సింగరేణిపై భారీ ఆర్థిక భారం పడుతోంది. పన్నెండేళ్లలో బకాయిలు పన్నెండు రెట్లు పెరిగాయి. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.3 వేల కోట్లు ఉన్న బకాయిలు, ఇప్పుడు ఏకంగా రూ.36 వేల కోట్లు దాటిపోయాయి. ప్రభుత్వం రంగ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. ఆర్థిక క్రమశిక్షణ లోపించడం సింగరేణి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. సింగరేణి సంస్థ, జెన్‌కో, ట్రాన్స్‌కో మూడు ప్రభుత్వ సంస్థలే అయినా, ఇవి నష్టాల్లో కూరుకుపోవడం విచారకరం. ఇతర రాష్ట్రాలకు బొగ్గు విక్రయిస్తున్నప్పుడు సింగరేణికి సకాలంలో నగదు అందుతోంది. కానీ సొంత రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు మాత్రం డిఫాల్టర్లుగా మిగిలిపోయాయి. ప్రైవేట్ కంపెనీలకు బొగ్గు ఇచ్చే ముందు ముందస్తు చెల్లింపులు తప్పనిసరి. అదే నిబంధన జెన్‌కో, ట్రాన్స్‌కోలకు లేకపోవడంతో బకాయిలు ఏటా పేరుకుపోతున్నాయి. రాష్ట్రంలో 64 శాతం విద్యుత్ ఉత్పత్తికి థర్మల్ ఆధారిత బొగ్గునే వాడుతున్నారు. దీనికోసం సింగరేణిపైనే ఆధారపడుతున్నా, చెల్లింపుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి తమకు నిధులు అందడం లేదని విద్యుత్ సంస్థలు సాకులు చెబుతూ, చెల్లింపులను నిలిపివేస్తూ సింగరేణిని ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో చెల్లింపులు సక్రమంగానే జరిగినప్పటికీ, రెండో టర్మ్ నుండి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆ సమయంలోనే బకాయిలు భారీగా పేరుకుపోవడం మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. మొదటి టర్మ్ చివరలో జెన్‌కో బకాయిలు రూ.660 కోట్లు ఉంటే, రెండో టర్మ్ చివరికి రూ.8 వేల కోట్లకు చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోని రెండున్నరేళ్ల కాలంలో మరో రూ.13 వేల కోట్లు పెరిగి, జూన్ నాటికి రూ.21 వేల కోట్లు దాటాయి. ట్రాన్స్‌కో విషయంలోనూ ఇదే కథ. బీఆర్ఎస్ హయాంలో రూ.3,464 కోట్ల నుండి రూ.12,868 కోట్లకు బకాయిలు పెరగగా, ప్రస్తుతం అది రూ.14,818 కోట్లకు చేరుకున్నాయి. సింగరేణి సంస్థ తన విధానంలో భాగంగా ప్రైవేట్ కంపెనీల నుండి ముందుగానే వసూళ్లు చేస్తుంది. దీనివల్ల ఆ సంస్థలకు బకాయిలు ఉండవు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్ సంస్థలకు కూడా సింగరేణి బొగ్గును సరఫరా చేస్తోంది. జూన్ నాటికి సింగరేణికి రావాల్సిన మొత్తం బకాయిలు రూ.38,508 కోట్లు కాగా, అందులో 95 శాతం వాటా కేవలం తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోలదే కావడం గమనార్హం. ఇతర రాష్ట్రాలతో పాటు ఎన్టీపీసీ బకాయిలు మాత్రం రూ.2 వేల కోట్ల లోపే ఉన్నాయి. తమిళనాడులోని టాన్‌జెడ్కో సంస్థ సింగరేణికి సకాలంలో చెల్లింపులు చేస్తోంది. పైగా సర్దుబాటు చేసుకునేలా కొంత మొత్తం సింగరేణి దగ్గర సర్‌ప్లస్‌గా కూడా ఉంది. రాష్ట్రం ఏర్పడినప్పుడు జెన్‌కో రూ.1,958 కోట్లు, ట్రాన్స్‌కో రూ.1,042 కోట్లు మాత్రమే సింగరేణికి బాకీ ఉన్నాయి. మొత్తం మీద రూ.3 వేల కోట్లు బాకీ ఉండగా, బీఆర్ఎస్ రెండు టర్మ్‌ల పాలన ముగిసే సమయానికి అది రూ.20,924 కోట్లకు ఎగబాకింది. జెన్‌కో రూ.8,056 కోట్లు, ట్రాన్స్‌కో రూ.12,868 కోట్లు బాకీ పడ్డాయి. ఆ సంస్థలు తీసుకున్న నిర్ణయాలు, చెల్లింపుల విషయంలో అనుసరించిన వైఖరి సింగరేణిపై భారాన్ని మోపాయి. ఒక ప్రభుత్వ రంగ సంస్థకు మరో ప్రభుత్వ రంగ సంస్థ అప్పు పడటం, దానిని తీర్చకపోవడం వల్ల వ్యవస్థలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం బాగున్నా, నిధుల కొరతతో సింగరేణి గనుల్లో కొత్త ప్రాజెక్టులు ఆగిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో బకాయిలు మరింత వేగంగా పెరిగాయి. ఆ సమయంలోనే అదనంగా రూ.15 వేల కోట్లు బాకీలు పెరిగి, మొత్తం రూ.36 వేల కోట్లకు చేరాయి. జెన్‌కో రూ.13,533.73 కోట్లు, ట్రాన్స్‌కో రూ.1,949.77 కోట్లు బాకీ పడ్డాయి. కాంగ్రెస్ పాలనలో జరిగిన చెల్లింపులు నామమాత్రంగానే ఉన్నాయి. విద్యుత్ శాఖతో పాటు ఫైనాన్స్ శాఖ కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతిలోనే ఉన్నప్పటికీ, పరిస్థితి మెరుగుపడలేదు. ఒకే నాయకత్వం కింద ఉన్నా సింగరేణికి నిధులు అందడం లేదు. ప్రభుత్వ విద్యుత్ అవసరాల కోసం సింగరేణి బొగ్గు సరఫరాను కొనసాగిస్తోంది, కానీ అందుకు తగ్గ ప్రతిఫలం మాత్రం సంస్థకు అందడంలేదు. ఈ బకాయిలకు సర్‌చార్జి, పెనాల్టీలు అదనంగా చేరడంతో సింగరేణిపై ఆర్థిక భారం రెట్టింపు అయింది. ఉత్పత్తి, అమ్మకాల్లో ఇబ్బందులు లేకున్నా, వసూళ్ల విషయంలో సింగరేణి అట్టడుగున ఉంది. నిరంతరం బొగ్గును సరఫరా చేస్తూ, తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నా, సంస్థ ఆర్థిక స్థితిపై మాత్రం తీవ్ర ప్రభావం పడుతోంది. బకాయిలు పేరుకుపోవడం వల్ల గనుల విస్తరణ, కార్మికుల సంక్షేమ పథకాలు, ఆధునీకరణ పనులు ఆగిపోయే ప్రమాదం ఉంది. సింగరేణి సంస్థను గట్టెక్కించాలంటే ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, జెన్‌కో, ట్రాన్స్‌కోల ద్వారా బాకీలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో భవిష్యత్తులో విద్యుత్ రంగానికి బొగ్గు సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జూన్ 2026 నాటికి తెలంగాణ జెన్‌కో రూ.21,589.73 కోట్లు, ట్రాన్స్‌కో రూ.14,818.38 కోట్లు సింగరేణికి చెల్లించాల్సి ఉంది. ఏపీ జెన్‌కో రూ.1,354.91 కోట్లు, కేపీసీఎల్ రూ.613.32 కోట్లు, మహా జెన్‌కో రూ.96.19 కోట్లు, ఎన్టీపీసీ రూ.35.23 కోట్లు బాకీ ఉన్నాయి. జెన్‌కో బకాయిలు 2014లో రూ.1,958 కోట్లు ఉండగా, 2026 నాటికి రూ.21,589 కోట్లకు పెరిగాయి. అదేవిధంగా ట్రాన్స్‌కో బకాయిలు 2016లో రూ.1,057 కోట్లు ఉంటే, 2026 జూన్ నాటికి రూ.14,818 కోట్లకు చేరుకున్నాయి. ఈ అంకెలు ప్రభుత్వ రంగ సంస్థల వైఫల్యాన్ని తెలియజేస్తున్నాయి. నిరంతరం విద్యుత్ ఇచ్చే సింగరేణికి, విద్యుత్ సంస్థలు అప్పులు ఎగ్గొట్టడం ప్రభుత్వ పాలనలో లోపాలను ఎత్తిచూపుతోంది.

## ఫీజులు పెంచుతున్నపాఠశాలలపైన కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మాదాసు అఖిల్



విశాలభారతి:కరకాగూడెం :భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరకగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజులు నియంత్రించాలని , ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కరకగూడెం ఎంఈఓకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మాదాసు అఖిల్ మాట్లాడుతూ కరకగూడెం మండలంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పెరిగాయని అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూన్నారని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సైతం విద్యార్థులకు అమ్ముతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని వారి గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక నర్సరీ విద్యార్థి దగ్గర పదిహేను ఇరవై వేల రూపాయలు మరియు పదవ తరగతి విద్యార్థుల వద్ద నలభై వేల నుండి యాభై వేల వరకు వసూళ్లు చేస్తున్నారని ఇలా ఉండటం ద్వారా విద్య అనేది పేద వారికి అందని ద్రాక్ష లాగా మారిందని వారు వాపోయారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో భవనాలు పెచ్చులుడుతున్నాయని , మరుగుదొడ్లు సరిగ్గా లేక , సరిపడ టీచర్లు లేక , త్రాగడానికి మంచినీరు కూడా లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు అన్నారు. ఎన్నో గొప్ప లక్ష్యాలతో చదువుకోడానికి వచ్చిన నూతన విద్యార్థులకు పాత సమస్యలే దర్శనం ఇచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# భూ వివాదాల్లో పోలీసులు

- స్టేషన్లను సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చడం
- బెయిల్, కేసుల పేరుతో వసూళ్లు
- సివిల్, భూ వివాదాల్లో చట్టవిరుద్ధ జోక్యం
- తప్పు చేసిన అధికారులపై సస్పెన్షన్లు
- అక్రమాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు
- పారదర్శకతతో ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత కలిగిన పోలీస్ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. నగర నడిబొడ్డున మొదలుకొని శివారు ప్రాంతాల వరకు భూమి, ఆర్థిక వివాదాలు సర్వసాధారణం కాగా, వీటి పరిష్కారంలో పోలీసు అధికారుల పాత్రపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాన్ని కాపాడాల్సిన వారు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోలీసు స్టేషన్లను సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మార్చుకోవడం వంటి వ్యవహారాలు శాఖా పరమైన గౌరవాన్ని మంటగలుపుతున్నాయి. ఉన్నతాధికారుల కఠిన నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు సిబ్బంది అక్రమ మార్గాల్లో సాగిస్తున్న ఈ దందా పోలీసు వర్గాల్లోనే కాకుండా ప్రజల్లోనూ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత కొద్దికాలంగా నగరంలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో వెలుగుచూస్తున్న ఘటనలు పోలీసుల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, ఆర్థిక లబ్ధి పొందే లక్ష్యంతో వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్ బెయిల్ పేరుతో భారీగా డబ్బు డిమాండ్ చేయడం, సివిల్ వివాదాల్లో ఒక పక్షానికి వత్తాసు పలకడం, కేసుల విచారణలో నిబంధనలను తుంగలో తొక్కడం వంటి ఆరోపణలు నానాటికీ పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులు ఇలాంటి అనైతిక చర్యలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటుగా అంతర్గత విచారణలు ముమ్మరం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీసు ఉన్నతాధికారులపై స్పష్టంగా కనిపిస్తోంది. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవలి కాలంలో జరిగిన ఒక ఉదంతం పోలీసు వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపింది. ఒక నిందితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసేందుకు గాను బాధ్యతాయుతమైన ఎస్సై స్థాయి అధికారి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం కలకలం రేపింది. సదరు అధికారి లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో అసలు బాగోతం బయటపడింది. చట్టపరమైన బాధ్యతలను విస్మరించి అవినీతికి పాల్పడిన సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటుగా కేసు నమోదు చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలో అప్రతిష్టను పెంచడమే కాకుండా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న ఇతర అధికారుల్లోనూ వణుకు పుట్టించింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకున్న మరొక ఘటన కూడా పోలీసు వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రైవేటు ఆసుపత్రికి సంబంధించిన సున్నితమైన వివాదంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ జోక్యం చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదులు శాఖలో అలజడి సృష్టించాయి. సివిల్ వ్యవహారాలతో పోలీసులకు ఎటువంటి సంబంధం లేనప్పటికీ, అనధికారికంగా జోక్యం చేసుకొని సెటిల్‌మెంట్లు నిర్వహించడం తీవ్ర అభ్యంతరకరమని ఉన్నతాధికారులు భావించారు. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపిన ఉన్నతాధికారులు సదరు ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తప్పించి కార్యాలయానికి అనుబంధించడం ద్వారా తమ కఠిన వైఖరిని ప్రదర్శించారు. ఇటువంటి చర్యలు పోలీసు అధికారుల్లో అప్రమత్తతను పెంచేందుకు దోహదపడుతున్నాయి. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో కూడా ఇలాంటి ఆరోపణలే మరికొన్ని బయటపడ్డాయి. పోలీస్ స్టేషన్‌నే వేదికగా చేసుకొని ఒక అధికారి ఆర్థిక వివాదాన్ని పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. బాధితులకు న్యాయం చేయాల్సిన స్థానంలో కూర్చుని, మధ్యవర్తిత్వం పేరుతో లాభపడాలని చూడటం పోలీసు నిబంధనలకు విరుద్ధమని ఉన్నతాధికారులు హెచ్చరించారు. సివిల్ వివాదాల్లో పదేపదే జోక్యం చేసుకుంటున్నట్లు పక్కా సమాచారం అందడంతో ఆ అధికారిపై ప్రత్యేక నిఘా ఉంచారు. శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుగా మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. పోలీసుల అధికార పరిధిని స్పష్టంగా నిర్దేశిస్తూ ఉన్నతాధికారులు గతంలోనే జారీ చేసిన మార్గదర్శకాలను కొందరు అధికారులు తుంగలో తొక్కుతున్నారు. భూమి వివాదాల విషయంలో పోలీసులకు నేరుగా జోక్యం చేసుకునే అధికారాలు లేవని న్యాయ నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. శాంతిభద్రతల సమస్యను సాకుగా చూపి ఇరు వర్గాలను పిలిపించి రాజీ చేయడం లేదా సెటిల్‌మెంట్లకు ఒత్తిడి తీసుకురావడం వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ ప్రక్రియలో పలువురు వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించి అన్యాయంగా ప్రయోజనం పొందుతుండగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్న బాధితులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగర శివార్లలో భూముల ధరలు రాత్రికి రాత్రే ఆకాశాన్ని తాకుతుండటంతో భూ వివాదాలు కూడా భారీగా పెరిగాయి. ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి కొందరు పోలీసులు ప్రయత్నిస్తుండటం విచారకరం. ఆక్రమణలు, నకిలీ పత్రాలు వంటి అంశాలు ఉన్నప్పుడు మాత్రమే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేయాలని చట్టం స్పష్టం చేస్తోంది. అలా కాకుండా, సివిల్ వివాదాల్లో మధ్యవర్తులుగా మారి వసూళ్లకు పాల్పడటం నేరపూరిత చర్యల కిందికే వస్తుంది. బలవంతపు సెటిల్‌మెంట్లకు దూరంగా ఉండాలని జారీ చేసిన ఆదేశాలను విస్మరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు అవసరమని మేధావులు కోరుతున్నారు. పెరుగుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో గతంలో నమోదైన పలు కేసులను ఉన్నతాధికారులు తిరిగి సమీక్షిస్తున్నారు. బాధితులను అనవసరంగా స్టేషన్ల చుట్టూ తిప్పుకోవడం, కేసుల విచారణను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం వంటి అంశాలపై నిశిత పరిశీలన జరుగుతోంది. పోలీసులు సామాన్యుడికి రక్షణగా ఉండాలనే నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు ఇటువంటి సమీక్షలు కీలకం కానున్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల వెనుక అధికారుల పాత్ర ఏముందో తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా సరే కఠిన శిక్షలు తప్పవని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజల భద్రత కోసం పనిచేయాల్సిన పోలీసు వ్యవస్థ, కొందరు వ్యక్తుల స్వార్థపూరిత చర్యల వల్ల అప్రతిష్ట పాలు కావడం ఆందోళనకరమైన విషయం. అధికారిక బాధ్యతలను విస్మరించి వ్యక్తిగత ఆశలకు ప్రాధాన్యత ఇస్తున్న అధికారుల తీరు మొత్తం శాఖ ప్రతిష్టను దెబ్బతీస్తోంది. చట్టాన్ని రక్షించాల్సిన బాధ్యత కలిగిన వారు అక్రమాలకు పాల్పడటం సామాన్య ప్రజల్లో పోలీసులపై ఉన్న గౌరవాన్ని తగ్గిస్తుంది. అవినీతిని అరికట్టడం, బాధ్యతాయుతమైన పాలన అందించడం ద్వారా మాత్రమే తిరిగి ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకునే అవకాశం ఉంటుంది. అక్రమ జోక్యాలపై రాజీ లేని వైఖరిని ప్రదర్శించడం ద్వారా పోలీసు శాఖ తన గౌరవాన్ని కాపాడుకోవాల్సి ఉంది. భవిష్యత్తులో పోలీసు వ్యవస్థలో ప్రక్షాళన చర్యలు మరింత వేగవంతం కానున్నాయి. అక్రమాలకు పాల్పడే అధికారులను గుర్తించి సస్పెన్షన్లు, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా శాఖలో క్రమశిక్షణను పునరుద్ధరించే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అనే భావనను బలోపేతం చేసేందుకు కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు కూడా వెనుకాడటం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల భద్రతను ప్రాధాన్యతగా భావించి, పారదర్శకమైన పాలన అందించడమే పోలీసులకు ఉన్న ఏకైక మార్గం.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన 10వ తరగతి సహచరులు

- తల్లి మృతితో విషాదంలో ఉన్న దేవరశెట్టి యాదగిరి కుటుంబానికి ఆర్థిక సహాయం
- పెద్దకర్మ కార్యక్రమంలో మానవత్వాన్ని చాటుకున్న సహాధ్యాయులు



**బయ్యారం విశాల భారతి:** బయ్యారం మండలంలో మానవత్వానికి నిదర్శనంగా నిలిచే ఘటన సోమవారం చోటుచేసుకుంది. తమ 10వ తరగతి సహచరుడు దేవరశెట్టి యాదగిరి తల్లి ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న సహాధ్యాయులు కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. నేడు నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి హాజరైన 10వ తరగతి మిత్రులు భవ్‌సింగ్, కిషోర్, రమేష్, సాయి, సతీష్, మహేష్, సలీం తదితరులు యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్లిష్ట సమయంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. వారి ఐక్యత, సేవాభావం, మానవత్వాన్ని స్థానికులు అభినందించారు. కష్టసమయంలో స్నేహితుడికి చేయూతనందించిన 10వ తరగతి మిత్రుల ఈ చర్య పలువురికి ఆదర్శంగా నిలిచింది.

## కొల్లూరు కాంగ్రెస్ మహిళా కమిటీ ఏకగ్రీవ ఎన్నికలు

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం.. నూతన అధ్యక్షురాలు సునీత**



**ఆలేరు, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా గృధపాక సునీత, ఉపాధ్యక్షురాలిగా బరపటి ఝాన్సీ, కోశాధికారులుగా లక్ష్మి, అరుణ, విజయ, ప్రధాన కార్యదర్శిగా సుజాత, కార్యదర్శిగా అరుణ, జనరల్ సెక్రటరీలుగా ఆండాలు, అన్నపూర్ణ, విజయ, భావనలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షురాలు దీపిక నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షురాలు గృధపాక సునీత మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు మహిళలందరినీ సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుధారాణి, శోభ, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు గురుకుల హాస్టల్‌లో దారుణ పరిస్థితులు

**మరుగుదొడ్లు అపరిశుభ్రం.. విద్యార్థుల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం .. పిడిఎస్యూ**



**ఆలేరు, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల (ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.) హాస్టల్‌లో నెలకొన్న దారుణ పరిస్థితులపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు నివసిస్తున్న ఈ హాస్టల్‌లో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాస్టల్‌లో ముఖ్యంగా మరుగుదొడ్లు పూర్తిగా అపరిశుభ్రంగా మారి, దుర్వాసన వెదజల్లుతున్నాయని, ఎక్కడ చూసినా మురుగు నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో శుభ్రత పూర్తిగా దెబ్బతిందని, దీంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం గురుకుల విద్యను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని ఆర్. ఉదయ్ అన్నారు. ప్రచారానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం హాస్టళ్లలో కనీస పారిశుద్ధ్య నిర్వహణకు కూడా నిధులు కేటాయించకపోవడం బాధాకరమని విమర్శించారు. హాస్టల్‌లో శాశ్వత పారిశుద్ధ్య కార్మికులను నియమించి ప్రతిరోజూ శుభ్రత నిర్వహించాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టి వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే జిల్లా కలెక్టర్, గురుకుల విద్యాసంస్థల అధికారులు స్వయంగా హాస్టల్‌ను సందర్శించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పిడిఎస్యూ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు, ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు చేపడతామని ఆర్. ఉదయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**విద్యార్థులకు ఉచిత డైరీల పంపిణీ**



**మోటకొండూర్, విశాలభారతి:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామంలో సోమవారం విద్యార్థులకు ఉచిత డైరీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శైలజ రాణి సొంత ఖర్చుతో విద్యార్థులందరికీ డైరీలను అందించడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి నర్సమ్మ, ఉపసర్పంచ్ కోల కృష్ణ పాల్గొని విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రధానోపాధ్యాయులు కె. శైలజ రాణి చూపుతున్న దాతృత్వాన్ని అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకంపాడు అభివృద్ధికి యాదగిరి బాటలు

- రూ.15 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన.. ప్రజల అవసరాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మరిపెడ సొసైటీ చైర్మన్ చాపల యాదగిరి రెడ్డి



**మరిపెడ, విశాల భారతి:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న మరిపెడ సహకార సంఘం (సొసైటీ) చైర్మన్ చాపల యాదగిరి రెడ్డి మరోసారి తన అభివృద్ధి దృక్పథాన్ని చాటుకున్నారు. మరిపెడ మండలం వెంకంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ విజియస్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.15 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామంలో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ సందర్భంగా చాపల యాదగిరి రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జులై 1న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

- పేదలకు ఇంటి స్థలాలు, పట్టాలు వెంటనే ఇవ్వాలి సీపీఐ
- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళనకు పిలుపు


మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

**శేరిలింగంపల్లి,విశాల భారతి:** రాష్ట్రంలో లక్షలాది మంది పేదలు సొంత ఇంటి స్థలం, ఇంటి పట్టా కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ మండిపడ్డారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూమిలేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం సీపీఐ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు ఎన్నోసార్లు వినతి పత్రాలు, అర్జీలు పెట్టుకున్న పేద ప్రజలు అధికంగా ఉన్నారని తెలిపారు. వారికి వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ పార్టీ 'చలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్' కార్యక్రమం నిర్వహిస్తుందని, శేరిలింగంపల్లి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఒకవైపు పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలం లేదని, మరోవైపు ప్రభుత్వ భూములు కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్న తీరు తీవ్రంగా ఖండించదగినదని ఆయన అన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు సాధించుకునేందుకు జులై 1న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిలో ఇల్లు లేని ప్రజలు, నిరుపేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజల హక్కుల కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం, ఇంటి పట్టా మంజూరు చేయాలని, ఖాళీ ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని తెలిపారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్ధృతమైన ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు చేపడతామని టి. రామకృష్ణ హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**దేవరుప్పల విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని, అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటింటికి చేరవేసేందుకు పార్టీ కార్యకర్తలకు కృషి చేయాలని, పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి వేదికగా పార్టీ కార్యాలయం పనిచేయాలని, గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్, మేడ విద్యాసాగర్, సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ జోగు అనిల్, మండల నాయకులు భోవనగిరి.యాకన్న, దామెర అనిల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు సర్దన్, గ్రామ పార్టీ అధ్యక్షులు నల్ల యాదగిరి, కొత్త దయాకర్ రెడ్డి, ఉప్పు నూతల సురేష్,వార్డు సభ్యులు, అటికం. స్రవంతి, కొంగరి జ్యోతి, పాలడుగు మాధవి,పార్టీ కార్యకర్తలు మంగ సారయ్య, రాపాక ఐలయ్య, అటికం నరసయ్య, ఊట్ల శివారెడ్డి, కొండ బుచ్చిరెడ్డి చిన్న, కొండ మల్లారెడ్డి చిన్న, కొంగరి రాములు, జోగు నరసయ్య, జోగు మల్లయ్య, కొండ పెద్ద బుచ్చిరెడ్డి, అటికం ఎల్లయ్య, కలువల నాగేష్, కాడబోయిన సోమయ్య, నల్ల పాండు, దేవరుప్పల మండల ఎస్టి సెల్ యూత్ అధ్యక్షులు గుగులోతు నరేందర్ నాయక్, భానోత్ రామచంద్రు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం

**ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పై బిఎల్ఏ ల కు అవగాహన సదస్సులో పాల్గొన్న పిసిసి అధ్యక్షులు**






**ఆర్మూర్, విశాల భారతి:** ప్రతి ఒక్కరు బూత్ లెవెల్ లో ఓటు హక్కును జాగ్రత్తగా కాపాడుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నందిపేట మండల కేంద్రంలో సోమవారం సాయిబాబా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో సన్మానం చేసి ర్యాలీగా ఫంక్షన్ హాల్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక కార్యకర్త సర్ ప్రోగ్రాంపై అవగాహన ఉంచుకొని పకడ్బందీగా ఓటు హక్కును కాపాడుకునే విధంగా చూసుకోవాలని కోరారు. బిఎల్ఏ లకు తగు సూచనలు చేశారు. బిజెపి ప్రభుత్వం ఓహక్కు చోరీ సీట్ చోరీ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు జరిగిన అన్యాయాన్ని వివరించారు. బిజెపి ప్రభుత్వం ప్రజలను కులం పేరుతో మరియు మత విద్వేషాలు సృష్టించి అరాచకాలు చేస్తుందని ధ్వజమెత్తారు. దేవుళ్ళ పేరుతో రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకోవడం చేస్తుంది కానీ బిజెపి ప్రభుత్వం పన్నెండున్నర సంవత్సరాలలో దేశ ప్రజలకు ఎటువంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదానికి పలికారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిజెపి పార్టీ నాయకులు హైదరాబాదులోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి జరగలేదని నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. నందిపేట్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు.

**బోధన్ శాసనసభ్యులు ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..**

ఓటు హక్కును జాగ్రత్తగా కాపాడుకోవాలని లేనియెడల రానున్న ఎన్నికలలో పోటీ చేయడానికి వీలుండదని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును వివరించారు

**నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి సన్మానం**

ఇటీవల నూతనంగా ఎన్నికైన నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూడ వెంకటేష్ ను ఘనంగా సన్మానించారు. అవగాహన సదస్సు విజయవంతం కావడంతో నాయకులు దూడ వెంకటేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ అధ్యక్షులు నగేష్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, తాయేర్ బిన్ హందన్, నిజామాబాద్ మేయర్, నుడా చైర్మన్ కేశవేణు, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనెల హరి, చైర్మన్లు, నందిపేట మండల సర్పంచ్ ఎర్రం (సిలిండర్ )లింగం యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, వివిధ గ్రామాల సర్పంచులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో రెండో రోజు కార్యక్రమం

**రేపూ కొనసాగనున్న ఇంటింటి వ్యాక్సినేషన్**

**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలో పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేక మిగిలిన ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాక్సిన్ అందించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పూజిత, సౌజన్య, వెంకన్న, స్వామి, కిరణ్ పాల్గొనగా, పీహెచ్ఎన్ మంగమ్మ, సూపర్వైజర్లు ఆచార్యులు, లలిత కుమారి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు. రేపు మూడవ రోజు కూడా కార్యక్రమం కొనసాగుతుందని, ఇంకా మిగిలిన చిన్నారులకు ఇంటికే వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని డాక్టర్ రవి తెలిపారు.



# యూనియన్ పేరుతో దాడి.. ప్రాణహాని బెదిరింపులు

- 'నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి: బాధితుడు వరికుప్పల జనార్ధన్
- యూనియన్ పేరుతో అరాచకం.. కార్మికుడు జనార్దన్ పై దాడి, బెదిరింపుల ఆరోపణలు
- కురవిలో యూనియన్ దౌర్జన్యం.. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన జనార్ధన్
- "నేను చెప్పిందే శాసనం".. యూనియన్ పేరుతో బెదిరింపులపై తీవ్ర ఆరోపణలు
- కార్మికులపై యూనియన్ ఆగడాలు.. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- రేట్ల పేరుతో పెత్తనం.. ఎదిరిస్తే దాడులంటూ ఆరోపణలు
- యూనియన్ పేరుతో దాడులు.. కురవిలో కలకలం
- కార్మికుల జీవనోపాధిపై యూనియన్ దౌర్జన్యమా?.. బాధితుల ఆవేదన
- దాడులు, బెదిరింపులతో భయాందోళన.. నిందితులపై చర్యలు కోరిన బాధితులు
- యూనియన్ ముసుగులో రౌడీయిజం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు
- కురవిలో యూనియన్ వివాదం.. పోలీసుల విచారణతో వెలుగులోకి రానున్న నిజాలు


కార్మికుడు సురేష్


కార్మికుల జనార్ధన్

**కురవి విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో యూనియన్ పేరుతో బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని బాధితుడు వరికుప్పల జనార్ధన్ ఆరోపించారు. రైతు సత్యనారాయణ పిలుపుతో పొలం వద్దకు వెళ్లిన సమయంలో ఎల్లయ్య ఫోన్ చేసి అనుచిత పదజాలంతో దూషిస్తూ, "రోడ్డు ఎక్కు.. నీ సంగతి చూస్తా" అంటూ బెదిరించినట్లు తెలిపారు. అనంతరం ఇంటికి వస్తున్న సమయంలో ఎల్లయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి జనార్ధన్ పై దాడి చేసి, చొక్కా చింపి, విచక్షణారహితంగా కొట్టి, అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపించారు. యూనియన్ పేరుతో కార్మికులను, రైతులను భయ భ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని జనార్ధన్ డిమాండ్ చేశారు.

**యూనియన్ పేరుతో కార్మికులను భయపెడుతున్నారు ఇదేనా సంఘం విధానం?: సురేష్**

కార్మికుడు సురేష్ మాట్లాడుతూ, "నేను నిర్ణయించిన కూలీ రేటుకే పని చేయాలి, లేకపోతే పని చేయనివ్వను" అంటూ యూనియన్ పేరుతో కార్మికులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం తనపై కూడా దాడి జరిగిందని తెలిపారు. "ఇక్కడ నేను చెప్పిందే శాసనం..ఏ పెద్దమనిషిని తీసుకొచ్చినా ఏమీ చేయలేరు" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, యూనియన్‌ను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. రైతుల పక్షాన నిలిచే, కార్మికుల హక్కులను కాపాడే నిజమైన యూనియన్ ఉండాలని కోరారు.

**జనార్ధన్ ఫిర్యాదుపై కేసు నమోదు దిశగా విచారణ. కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై బి సతీష్ హామీ.**

దాడి అనంతరం బాధితుడు వరికుప్పల జనార్ధన్ కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై ఘటనపై విచారణ ప్రారంభించి, పూర్తి వివరాలు సేకరించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

## సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర

- గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి



**మరిపెడ, విశాలభారతి:** చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి అన్నారు.సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లచ్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని అమిర్యా తండాలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను సర్పంచ్ గుగులోత్ సరోజ నరేందర్ నాయక్ తో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.8 లక్షలు, చిల్డ్రెన్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ నిధుల నుంచి రూ.2 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు కాగా, మొత్తం రూ.12 లక్షలతో భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. చిన్నారులకు అనుకూల వాతావరణంలో విద్య, పోషకాహార సేవలు అందించేందుకు సొంత భవనాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు.గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.ప్రజల సహకారంతో గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు జరుపుల విజయ్, ఉపసర్పంచ్ గుగులోత్ బాలు, ఏఈ అజయ్,కార్యదరి జి.హారిక,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరా, నాయకులు వెంకన్న, లక్ష్మణ్, బాగి, పర్సు, బాల, భగవాన్, వీరన్న, తిరుపతి, మంగీలాల్, అంగన్‌వాడీ టీచర్లు నీలా, శాంత, పద్మ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సత్యవతి రాథోడ్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



**కురవి విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బాధావత్ లక్ష్మీ రాజు నాయక్ కుమార్తె విద్య గౌతమి వివాహం జూలై 8, 2026న (బుధవారం) మహబూబాబాద్‌లో జరగనుంది. ఈ సందర్భంగా వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్కు సోమవారం వివాహ ఆహ్వాన పత్రికను మర్యాదపూర్వకంగా అందజేశారు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వివాహ వేడుక విజయవంతంగా జరగాలని అభిలషిస్తూ తన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ యువనాయకులు గుగులోత్ శ్రీరామ్ నాయక్, బొడ శ్రీను నాయక్, బత్తిని వెంకన్నతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రెండు బండి ఎద్దులు మృతి

- రైతులకు రూ.1.50 లక్షల మేర నష్టం.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి



**మహబూబాబాద్ విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా పర్వతగిరి లక్ష్మ తండ గ్రామంలో సోమవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు భూక్య సీతారాం మరియు బాదావత్ బాలాజీలకు చెందిన రెండు బండి ఎద్దులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయ పనులకు ఎంతో కీలకమైన ఈ ఎద్దుల మృతి కారణంగా రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. మృతి చెందిన రెండు ఎద్దుల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ ఘటనతో రైతు కుటుంబాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఘటనపై విచారణ జరిపి, బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## సెల్లార్ వ్యాపారాలు ఖాళీ చేయించాలి

- డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన మిద్దెల మల్లారెడ్డి




**మియాపూర్, విశాల భారతి:** మియాపూర్ సర్కిల్ పరిధిలో ప్రధాన రోడ్డు పక్కన సెల్లార్లలో వ్యాపారాలు కొనసాగుతున్నాయని, వర్షాకాలంలో నీరు నిండి షార్ట్ సర్క్యూట్‌తో ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని మిద్దెల మల్లారెడ్డి డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతేడాది విజేత సూపర్ మార్కెట్ సెల్లార్‌లో నీరు నిండి కోట్ల నష్టం వచ్చిందని గుర్తుచేశారు. భవాని హార్డ్‌వేర్, అర్చన హాస్పిటల్, విజేత సూపర్ మార్కెట్ సహా పలు చోట్ల సెల్లార్ వ్యాపారాలను వెంటనే ఖాళీ చేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు.

## ఎల్లమ్మబండలో పారిశుద్ధ్య పనుల తనిఖీ.. అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు

- శంషీగూడ వార్డు 245లో ఆకస్మిక పర్యటన.. చెత్త రహిత కాలనీలే లక్ష్యంగా పనిచేయాలి


ఎల్లమ్మ బండలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్,డీసీ చాముండేశ్వరి

**కుకట్‌పల్లి,విశాల భారతి:** క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనుల తీరును తెలుసుకునేందుకు కుకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్ సోమవారం ఉదయం శంషీగూడ వార్డు245 పరిధిలోని ఎల్లమ్మబండ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 ఉప కమిషనర్ చాముండేశ్వరి, డీఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలతో కలిసి ఆయన ఎల్లమ్మబండ మెయిన్ రోడ్డుతో పాటు అంతర్గత వీధుల్లో కలియతిరిగి పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఉప కమిషనర్ చాముండేశ్వరి, మహిళా ఎస్ఆర్‌పీ అధికారులు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య చర్యలు, డోర్‌టుడోర్ చెత్త సేకరణ, స్వచ్ఛ ఆటోల పనితీరును జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్‌కు వివరించారు. రోడ్లపై చెత్త కుప్పలు లేకుండా చూడటంతో పాటు బ్లాక్ స్పాట్‌స్‌ను పూర్తిగా తొలగించి ఆ ప్రాంతాలను సుందరీకరించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి తప్పనిసరిగా సేకరించాలని, ఇందుకోసం ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సముదాయాల నుంచి రోడ్డుపై చెత్త వేస్తే కఠినంగా జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. స్వచ్ఛ ఆటోలు ప్రతి వీధికి వెళ్లేలా చూడటంతో పాటు వాటి కదలికలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. 'స్వచ్ఛ కుకట్‌పల్లి' లక్ష్యం నెరవేరాలంటే కేవలం అధికారులు, సిబ్బందే కాకుండా ప్రజల భాగస్వామ్యం కూడా తప్పనిసరని, కాలనీ సంఘాలతో సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్ పేర్కొన్నారు. ఎల్లమ్మబండ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్ఫూర్తిని జోన్ పరిధిలోని అన్ని వార్డుల్లో కొనసాగించాలని ఆయన అధికారులను కోరారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రైతన్నకు ఊరట.. కురుస్తున్న చిరు జల్లులు

**ఆశాజనకంగా పడని వర్షం**
**ఈ నెలలో 93.3 మిల్లీమీటర్లే వానే**
**15వేల ఎకరాల్లో పత్తి గింజలు నాటిన రైతులు**

**అశ్వాపురం, విశాలభారతి :**

ఈ ఏడాది తొలకరి ప్రారంభం నుండి వాతావరణంలోని వర్షాభావ పరిస్థితులు మందకోడిగానే కనిపిస్తున్నాయి. మృగశిర కార్తె రాకతో వర్షాలు విస్తారంగా పడతాయన్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. మండలంలోని రైతులు జూన్ మొదటి వారం నాటికే సుమారు 15 వేల ఎకరాలలో పత్తి విత్తనాలను నాటారు. ఒక్కొక్క ఎకరాకు రెండు పత్తి విత్తన ప్యాకెట్ల చొప్పున, కూలీలతో కలుపుకొని సుమారు రూ. 5 వేల వరకు సాగుకు ఖర్చు చేశారు. తొలకరికి ముందే మే నెలలోనే మెట్టచేలను చదునుగా దుక్కులు చేసుకొని ఉడుకుదుబ్బలోనే గింజలు పెట్టారు. తొలకరి ప్రారంభంతో సమృద్ధిగా వర్షాలు పడతాయిలే సేద్యం ఆశాజనకంగా సాగుతుందనుకున్న అన్నదాతలకు కాలనుకూలత లేకుండా కంగు తినిపించింది. అయితే గత రెండు రోజులుగా చెదురు మొదురుగా జల్లులు పడడంతో కాస్త ఉపశమనం చెందిన రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. ఆరుద్ర కార్తె మొదలై ఆరు రోజులు కావస్తుంది. ఈ కార్తెలోనైనా ముమ్మర వర్షపాతం నమోదు కాకపోతుందా అని గంపెడు ఆశతో రైతులు ఆకాశం వంక చూస్తున్నారు.



**ఈ నెలలో 93. 3 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదు**

అధికారిక గణాంకాల ప్రకారం మండలంలో ఈరోజు వరకు 183.03 మిల్లీమీటర్ల వర్షం నమోదు కావలసి ఉన్నప్పటికీ కేవలం 93.03 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. పడాల్సిన దానికంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా అనావృష్టి పరిస్థితుల్లోనే ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే మండలంలో 9500 ఎకరాలలో వరి సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. పొడి దుక్కులు దున్నుకొని నారుమడులను సిద్ధం చేసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో వరి నార్ల కోసం విత్తనాలు కూడా చల్లుకున్నారు. ఫలితంగా కాలం కరుణించకపోవడం ఇప్పటివరకు ఆశాజనకమైన వర్షపాతం నమోదు కాకపోవడం ఈ ఏడాది వ్యవసాయానికి కాలం అనుకూలిస్తుందా లేదా అన్న సంకేతాలు స్పష్టంగా అర్థం కావడం లేదు. కాలం కనుక సక్రమంగా అనుకూలిస్తే జూలై రెండవ వారం నుండి రైతులు వరి నాట్లలో నిమగ్నమవ్వొచ్చని అధికారులు అంటున్నారు. అయితే మరో తొమ్మిది వర్షాకాలం మొదలై నెల రోజులు పూర్తి కావడంతో పాటు రెండు కార్తెలు ముగిసి వర్షాకాలానికే బలమైన కార్తె అని రైతులు చెప్పుకునే పునర్వస్కార్తె జులై నెల 06వ తేదీ ప్రవేశించనుంది. మరి సాగుకు ఈ ఏడాది కాలం అనుకూలిస్తుందా !లేదా అన్నది వేచి చూడాల్సిందేనని రైతులంటున్నారు.

## క్రైమ్ ఫ్రీ డివిజన్ల ఏర్పాటుకు కృషి చేయాలి




**విశాలభారతి, గోదావరిఖని:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ డీసీపీ బి. రామ్‌రెడ్డి వార్షిక తనిఖీల్లో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిశుభ్రత,పరిసరాల నిర్వహణ,రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం పోలీస్ సిబ్బందితో పరేడ్ నిర్వహించి,వారి స్క్వాడ్ డ్రిల్,నీట్ టర్న్అవుట్‌ను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు,విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన సమస్యలు,నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి,పెండింగ్ కేసుల పరిష్కార స్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని తగిన సూచనలు చేశారు. అనంతరం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 డివిజన్లకు నియమితులైన డివిజన్ పోలీస్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారి విధులు,బాధ్యతలపై పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,ప్రతి డివిజన్ పోలీస్ ఆఫీసర్ తన పరిధిలో ఆస్తి సంబంధిత నేరాలు,మహిళలపై నేరాలు,సైబర్ నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి డివిజన్‌లో నంబర్ ప్లేట్‌లు లేని,సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు.డివిజన్ పరిధిలోని యువత,పెద్దలు, ప్రజాప్రతినిధులతో కలిసి స్ట్రీట్ కార్నర్ సమావేశాలు, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు నేరాల నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. అక్రమ వాహనాల వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.డివిజన్ పోలీస్ ఆఫీసర్లు ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పి,యువతను గంజాయి, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్,లోన్ యాప్ మోసాలు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచేలా అవగాహన కల్పించాలని,వారిని సామాజిక సేవా కార్యక్రమాల వైపు మళ్లించేలా ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి డివిజన్‌లోని ముఖ్యమైన వైటల్ ఇన్‌స్టాలేషన్లు, ఆసుపత్రులు, దేవాలయాలు,పెద్ద అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.అలాగే ఆయా సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది,నిర్వాహక కమిటీలు,బాధ్యుల పూర్తి వివరాలను సేకరించి,అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించేందుకు సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ప్రతి డివిజన్ పోలీస్ ఆఫీసర్ వారానికి కనీసం రెండు నుంచి మూడు సార్లు తన పరిధిలో పర్యటించి స్థానికులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి సందర్శనలో ప్రజలతో సమయం గడుపుతూ వారి సమస్యలను తెలుసుకొని,వార్డు అధికారులతో కలిసి నైట్ హార్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో డివిజన్ పెద్దలు,యువతతో చర్చించి స్థానిక సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను గుర్తించి, సంబంధిత ఇన్‌స్పెక్టర్, సెక్టార్ ఎస్ఐలు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి డివిజన్‌ను క్రైమ్ ఫ్రీ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ఆస్తి సంబంధిత నేరాలు, సైబర్ నేరాలు, మహిళలపై నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీపీ స్పష్టం చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని డీసీపీ బి. రామ్‌రెడ్డి సూచించారు.ఈ తనిఖీల్లో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అఫ్జలుద్దీన్,ఎస్ఐలు రమేష్,మనోహర్, అనూష పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుతో ఎల్లమ్మబండలో తనిఖీ

- అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు
- పారిశుద్ధ్య లోపాలపై స్థానికుల ఫిర్యాదు.. క్షేత్రస్థాయిలో పరిశీలన
- 'చెత్త రహిత కాలనీలే లక్ష్యంగా పనిచేయాలి'



**కూకట్‌పల్లి,విశాల భారతి:** 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన కుకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్ సోమవారం ఉదయం శంషీగూడ వార్డు245 పరిధిలోని ఎల్లమ్మబండ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆల్విన్ కాలనీ సర్కిల్51 ఉప కమిషనర్ చాముండేశ్వరి, డీఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలతో కలిసి ఆయన మెయిన్ రోడ్డుతో పాటు అంతర్గత వీధుల్లో కలియతిరిగి పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎల్లమ్మబండ ప్రాంతంలో పారిశుద్ధ్య లోపాలు, చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని స్థానికులు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ చాముండేశ్వరి ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య చర్యలు, డోర్‌టుడోర్ చెత్త సేకరణ, స్వచ్ఛ ఆటోల పనితీరును జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్‌కు వివరించారు. స్థానిక మహిళా ఎస్ఆర్‌పీ అధికారి కూడా ప్రజావాణి ఫిర్యాదు నేపథ్యంలో తీసుకున్న చర్యలను వివరించారు.'ప్రజావాణి'కి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకోవాలని, 48 గంటల్లో పరిష్కరించేలా చూడాలని జోనల్ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై చెత్త కుప్పలు లేకుండా చూడటంతో పాటు బ్లాక్ స్పాట్‌స్‌ను పూర్తిగా తొలగించి సుందరీకరించాలని సూచించారు.ప్రతి ఇంటి నుంచి తడి,పొడి చెత్తను వేరు చేసి తప్పనిసరిగా సేకరించాలని, ఇందుకోసం ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సముదాయాల నుంచి రోడ్డుపై చెత్త వేస్తే కఠినంగా జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. స్వచ్ఛ ఆటోలు ప్రతి వీధికి వెళ్లేలా చూడటంతో పాటు వాటి కదలికలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. 'స్వచ్ఛ కుకట్‌పల్లి' లక్ష్యం నెరవేరాలంటే అధికారులు, సిబ్బందితో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా తప్పనిసరని, కాలనీ సంఘాలతో సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని జోనల్ కమిషనర్ మయాంక్‌సింగ్ పేర్కొన్నారు. ఎల్లమ్మబండలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్ఫూర్తిని జోన్ పరిధిలోని అన్ని వార్డుల్లో కొనసాగించాలని కోరారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వర్షా కాల ట్రాఫిక్‌కు సమగ్ర ప్రణాళిక

- వాటర్ లాగింగ్‌పై ప్రత్యేక దృష్టి .. కీలక ఆదేశాలు జారీ చేసిన సీపీ రమేష్


సైబరాబాద్ కమిషనరేట్‌లో వర్షా కాల ట్రాఫిక్ సమస్యలపై జూమ్ ద్వారా సమీక్షిస్తున్న సీపీ డా. ఎం. రమేష్



**సైబరాబాద్,విశాల భారతి:** వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు, వాటర్ లాగింగ్ సమస్యల నివారణకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆదేశించారు. సోమవారం కమిషనరేట్‌లో జూమ్ ద్వారా ట్రాఫిక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ ఏడీసీపీ నరేందర్, ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. వాటర్ లాగింగ్ ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఫ్రీ లెఫ్ట్, యూటర్న్‌లను అడ్డుకునే వాహనాలు, రాంగ్ రూట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విప్రో, డీఎల్‌ఎఫ్, కూకట్‌పల్లి వైజంక్షన్, మియాపూర్, నిజాంపేట్‌లో పనులు వేగవంతం చేయాలన్నారు. రాత్రి విధుల్లో రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోట్లు తప్పనిసరి అని ఆదేశించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు చెందిన 150 మంది సిబ్బంది పనితీరు సమీక్షించి సూచనలు చేశారు. వాటర్ లాగింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం మాస్టర్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలన్నారు.

## వీకెండ్ డ్రంక్ డ్రైవ్‌లో 300 మంది బుక్

**కఠినంగా వ్యవహరిస్తాం .. అందరినీ కోర్టుకు హాజరుపరుస్తాం: ఏడీసీపీ హన్మంతరావు**



**సైబరాబాద్ విశాల భారతి:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 300 మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏడీసీపీ జి.హన్మంతరావు తెలిపారు. 259 ద్విచక్ర వాహనదారులు, 34 కార్లు, 6 ఆటోలు, ఒక హెవీ వాహనం ఉన్నాయి. బీఏసీ పరిధి 36 నుంచి 550 ఎంజీ వరకు నమోదైంది. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపరుస్తామన్నారు. మద్యం తాగి ప్రమాదానికి కారణమైతే బీఎన్ఎస్ 105 కింద 10 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. గత వారం కోర్టులు 251 డ్రంక్ డ్రైవ్ కేసులు పరిష్కరించి జరిమానాలు విధించాయని వెల్లడించారు.

# రోడ్డుపై చెత్తపారబోసి అడ్డంగా దొరికిపోయిన మహిళ

- వీడియో వైరల్ కావడంతో దిగొచ్చిన మహిళ
- బహిరంగంగా క్షమాపణ.. ఇకపై చేయనని హామీ
- పారిశుధ్య కార్మికురాలిపై దాడి.. ప్రజావాణిలో లిఖితపూర్వక క్షమాపణ

**హైదరాబాద్ - విశాల భారతి**

నగరంలో బాధ్యతారాహిత్యంగా రోడ్డుపై చెత్త పారబోసి, అడ్డుచెప్పిన పారిశుధ్య కార్మికురాలిపై దాడి చేసిన ఓ మహిళ వివాదకు తన తప్పు తెలుసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పారు. సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడం, నెటిజన్లు తీవ్రంగా ట్రోల్ చేయడంతో ఆమె దిగొచ్చారు. ఇకపై ఇలాంటి పొరపాటు జరగబోదని, పరిసరాల పరిశుభ్రతకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**అసలేం జరిగిందంటే..**

ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రధాన రహదారి పై స్కూటీపై వెళ్తున్న మహిళ ఇంటి చెత్తను ప్లాస్టిక్ కవర్‌లో తీసుకొచ్చి రోడ్డు పక్కన పడేసింది. అదే సమయంలో విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు అడ్డుకోగా, ఆ మహిళ దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడింది. వెనుక కారులో వెళ్తున్న ఓ వ్యక్తి ఈ దృశ్యాన్ని తన మొబైల్‌లో రికార్డ్ చేశాడు. ఆ వీడియోను 'స్వచ్ఛ హైదరాబాద్‌కు మనం ఏం చేస్తున్నాం?' అనే క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో క్షణాల్లో వైరల్ అయింది.



రోడ్డుపై చెత్త వేసినందుకు లిఖితపూర్వకంగా క్షమాపణ చెబుతున్న మహిళ

**నెటిజన్ల ఆగ్రహం**

వీడియో చూసిన నెటిజన్లు ఆ మహిళపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చదువుకున్నవారే ఇలా చేస్తే ఇక మార్పు ఎలా వస్తుంది', 'కార్మికురాలిపై చేయి చేసుకోవడం దారుణం', 'జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాలి' అంటూ కామెంట్ల వర్షం కురిపించారు. కొందరు ఆమె వాహనం నంబర్ ఆధారంగా ట్రాఫిక్ పోలీసులకు, జీహెచ్ఎంసీకి ట్యాగ్ చేసి ఫిర్యాదు చేశారు.

**తప్పు తెలుసుకుని క్షమాపణ**

వీడియో వైరల్ కావడం, తనపై వస్తున్న విమర్శలతో స్పందించిన ఆ మహిళ సోమవారం సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేశారు. 'నమస్తే, నేను రోడ్డుపై చెత్త వేసిన వీడియో చూశాను. ఆ సమయంలో తొందరలో ఉండి, ఆలోచించకుండా అలా చేశాను. అది నా తప్పే. నా వల్ల నగర పారిశుద్ధ్యానికి భంగం కలిగింది. జీహెచ్ఎంసీ సిబ్బందికి, హైదరాబాద్ ప్రజలకు క్షమాపణ చెబుతున్నాను' అని పేర్కొన్నారు. 'ఇకపై నా ఇంటి చెత్తను జీహెచ్ఎంసీ డబ్బాలోనే వేస్తాను. రోడ్డుపై చెత్త వేయడం చట్టరీత్యా నేరమని తెలుసుకున్నాను. నాలాగా ఎవరూ చేయొద్దని కోరుతున్నాను. స్వచ్ఛ హైదరాబాద్ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి' అని విజ్ఞప్తి చేశారు.

**ప్రజావాణిలో లిఖితపూర్వక క్షమాపణ**

శనివారం పారిశుధ్య కార్మికురాలిపై దాడి చేసిన ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో, సదరు మహిళ నేడు సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి హాజరయ్యారు. తన తప్పును పూర్తిగా అంగీకరిస్తూ, క్షమించమని కోరుతూ లిఖితపూర్వకంగా క్షమాపణ లేఖను అధికారులకు అందజేశారు. ఇకపై పారిశుధ్య కార్మికులతో గౌరవంగా ప్రవర్తిస్తానని, ఇలాంటి ఘటనలు పునరావృతం కావని హామీ ఇచ్చారు.

**జీహెచ్ఎంసీ స్పందన**

ఈ ఘటనపై జీహెచ్ఎంసీ అధికారులు స్పందిస్తూ, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.500 నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరులు బాధ్యతగా వ్యవహరించి, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌ను అగ్ర స్థానంలో నిలపాలని కోరారు

## శంషాబాద్‌లో సీపీఐకి భారీ షాక్

- బీఆర్ఎస్‌లోకి అన్నెపు ప్రభు బృందం చేరిక



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడ 119వ డివిజన్‌లో సీపీఐ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి కీలకంగా పనిచేసిన రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అన్నెపు ప్రభు ముదిరాజ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గత 15 రోజుల క్రితం సీపీఐ పార్టీకి రాజీనామా చేసిన అన్నెపు ప్రభు, ఆదివారం రోజున రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లొల్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో తన మిత్రులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో అన్నెపు ప్రభు ముదిరాజ్ (సీపీఐ-ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు), అరుణ్ ముదిరాజ్ (ఆనంద్ గ్రూప్ సీఈవో), బి. లింగం యాదవ్ (సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు), చాంద్ పాషా (ఫాల్స్ సీలింగ్ యూనియన్ అధ్యక్షుడు), శ్రీనివాస్ చారి, శ్రీధర్, దేవేందర్ నాయక్, సతీష్ ముదిరాజ్, రాజు గౌడ్, లోకేష్ నాయక్ (బంజారా మేస్త్రి యూనియన్ అధ్యక్షుడు), మనీష్ పటేల్ (ఇండస్ట్రీస్ లేబర్ యూనియన్ నాయకుడు) తదితర కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ప్రజా సేవలే బీఆర్ఎస్ పార్టీ ముఖ్య లక్ష్యాలని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి, రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, మిత్రులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సేవ ప్రారంభం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** పిల్లోనిగూడ గ్రామం నుండి పాలమకుల మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఈరోజు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ బస్సు ఉదయం 8:30 గంటలకు విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్తూ, సాయంత్రం 4:30 గంటలకు తిరిగి గ్రామానికి తీసుకువస్తుంది. రోజుకు రెండు ట్రిప్పులు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పానుగంటి స్వర్ణలత నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పిల్లి శ్రీశైలం ముదిరాజ్, మాజీ సర్పంచ్ కర్రే బుచ్చమ్మ, వార్డు సభ్యులు మహేష్ ముదిరాజ్, కృష్ణ, గణేష్, అలాగే గ్రామ నాయకులు జుర్కి రమేష్ పటేల్, పి. సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మైత్రి లహరి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- కాలనీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని నూతన కమిటీ హామీ



**విశాల భారతి – అబ్దుల్లాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల రోడ్డులో ఉన్న మైత్రి లహరి కాలనీ సంక్షేమ సంఘం (2026-2027) నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులందరికీ సంఘం ప్రతినిధులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కాలనీ సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం అంకితభావం, పారదర్శకత, నిబద్ధతతో పనిచేస్తుందని సంఘం ఆశాభావం వ్యక్తం చేసింది. కాలనీలో పౌర సౌకర్యాల మెరుగుదల, పరిశుభ్రత పరిరక్షణ, భద్రతా చర్యల బలోపేతం, సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, నివాసితులందరి కోసం సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలకు కమిటీ ప్రాధాన్యత ఇవ్వనుందని పేర్కొంది. సంఘం నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా జి. శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. మురళి, ఉపాధ్యక్షుడిగా ఎం. రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిహెచ్. రవీందర్ రెడ్డి, కోశాధికారిగా ఎం. మధు రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా కె. దామోదర్ రెడ్డి, ఎన్. భాస్కర్ రావు, వై. ఇంద్ర రెడ్డి, పి. గణేష్, కె. అనిల్ రెడ్డి ఎన్నికయ్యారు. మైత్రి లహరి కాలనీని మరింత పరిశుభ్రమైన, సురక్షితమైన, సుందరమైన మరియు చైతన్యవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కాలనీ వాసులందరూ తమ పూర్తి సహకారం అందించాలని సంఘం నూతన కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. నివాసితుల సహకారంతో కాలనీ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## కబ్జాదారుల చెరలో 50 కోట్ల బల్దియా భూమి

- చందానగర్‌లో 4 వేల గజాల స్థలం ఆక్రమణ
- మహిళలతో పోరాటం తప్పదు: మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

**చందానగర్ - విశాల భారతి**

మహిళామణుల అవసరాల కోసం కేటాయించిన సుమారు 50 కోట్ల విలువైన బల్దియా భూమి కబ్జాదారుల పాలైంది. చందానగర్ డివిజన్ కైలాష్ నగర్‌లోని 4 వేల గజాల స్థలాన్ని అడ్డగోలుగా ఆక్రమించారని మాజీ కార్పొరేటర్, న్యాయవాది బొబ్బ నవతారెడ్డి ఆరోపించారు. కాపాడాల్సిన అధికారులే ప్రజాప్రతినిధి అండతో కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు.



బల్దియా భూమి ఆక్రమణపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి

**కలెక్టర్ ఉత్తర్వులు.. ప్రహరీ కూల్చివేత**

సర్వే నంబర్ 210లోని ఈ స్థలంలో మహిళా భవనం, మోడల్ మార్కెట్, ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2018 మార్చి 7న, 2019 మే 5న ప్రొసీడింగ్స్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించారు. దీని ప్రకారం 2019లోనే కార్పొరేషన్ అధికారులు ఆ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించి, గేటు కూడా ఏర్పాటు చేశారు. అయితే కబ్జాదారులు 2022 ఆగస్టు 10న, 2024 ఫిబ్రవరి 9న దౌర్జన్యంగా ఆ ప్రహరీని కూల్చేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక మున్సిపల్ అధికారులు చోద్యం చూశారే తప్ప చర్యలు తీసుకోలేదని నవతారెడ్డి ఆరోపించారు.

**ఆర్టీఐకి తప్పుడు సమాచారం**

స్థలం ఆక్రమణపై నవతారెడ్డి ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా అధికారులు 'అది ప్రభుత్వ భూమి, మాకు సంబంధం లేదు' అని తప్పుడు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె స్వయంగా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలను జతచేసి 2024లో డెప్యూటీ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్‌లో సైతం జోనల్ కమిషనర్‌కు మరోసారి వినతిపత్రం ఇచ్చారు. అయినా ఉన్నతాధికారుల్లో ఉలుకూ పలుకూ లేదన్నారు.

**అనుమతులు లేని ఉపకేంద్రం**

మున్సిపల్ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని అదే స్థలంలో టీజీఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి తెరతీశారని ఆమె తెలిపారు. ఆర్టీఐ ద్వారా విద్యుత్ శాఖను వివరణ కోరగా ఆ భూమికి సంబంధించి తమ వద్ద ఎలాంటి అధికారిక కేటాయింపు పత్రాలు లేవని, ప్రజాప్రతినిధుల సూచనతో నిర్మాణం చేశామని సమాధానమిచ్చారన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్ఎంసీ యాక్ట్ 635 కింద నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

**న్యాయపోరాటానికి సిద్ధం**

ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారని, రూ.50 కోట్ల ప్రజా ధనాన్ని కబ్జాదారులకు ధారాదత్తం చేస్తున్నారని నవతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ప్రకారం తక్షణమే ఆ భూమిని స్వాధీనం చేసుకుని మహిళా భవనం, ఫంక్షన్ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు మొద్దునిద్ర వీడి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ అధికారుల తీరును ఎండగడుతూ పెద్ద ఎత్తున మహిళా పోరాటం, న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

## పెద్దాసుపత్రులకి తీసిపోని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి సేవలు



**విరిగిన పై దవడ కి ఆధునిక ఆపరేషన్**

**పాల్వంచ విశాలభారతి :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, ధాబా నగర్‌కు చెందిన ముప్పై ఐదేళ్ల బానోత్ కరణ్ సింగ్ కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన దాడిలో ఎడమ ముఖ భాగానికి తీవ్ర గాయాలపాలయ్యారు. అనంతరం ఆయనను సామాజిక ఆరోగ్య కేంద్రం, పాల్వంచకు తీసుకురాగా, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆయనకు పై దవడ-చెంప ఎముకల విరుగు ఉన్నట్లు నిర్ధారించారు. రోగి పరిస్థితిని పరిశీలించిన వైద్యులు డాక్టర్ వంశీ వెంటనే శస్త్రచికిత్సకు నిర్ణయించి, దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలో టైటానియం ప్లాటింగ్ ద్వారా విరిగిన ఎముకలను యథాస్థానంలో అమర్చడంతో పాటు ఇంటర్ మ్యాక్సిల్లరీ ఫిక్షన్ చేసి దవడలను స్థిరపరిచారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను ఓరో మాక్సిలరీ ఫేసియల్ సర్జన్ డా. మోహన్ వంశీ కృష్ణ, మత్తు వైద్యుడు డా. శంకర్ రావు విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్సలో నర్సులు శ్రీమతి పి. రేవతి, శ్రీమతి ఎస్. జ్యోతి మరియు శరీ చి. జగదీష్ సహకారం అందించారు. సాధారణంగా ఇలాంటి క్లిష్టమైన ముఖ ఎముకల శస్త్రచికిత్సలు తృతీయ స్థాయి ఆసుపత్రుల్లో మాత్రమే నిర్వహిస్తుంటారు. సుమారు అరవై డెబ్బై వేల రూపాయలు ఖర్చు అయ్యే



శస్త్రచికిత్సను ఒక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విజయవంతంగా నిర్వహించడం, ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వ ఆసుపత్రుల సామర్థ్యం గణనీయంగా పెరిగిందని చాటిచెబుతోంది. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సను నిర్వహించిన డా. మోహన్ వంశీ కృష్ణ మరియు ఆపరేటింగ్ బృందాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డా. రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రామ్ ప్రసాద్, ఆర్ఎంఓ డా. దొర అభినందించారు. గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్యసేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందించేందుకు ఇదే స్ఫూర్తితో మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. అలాగే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న నిపుణుల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని విద్యానగర్ కాలనీలో తన హయాంలో మంజూరైన నిధులతో చేపడుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యానగర్ కాలనీతో పాటు హయత్‌నగర్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చామని, నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీవాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి కొనసాగిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి
- 15లోగా డివిజన్, గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా భవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖాలిద్, సహ ఇన్‌చార్జ్‌లు రోషిని జైస్వాల్, భవ్య, రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే కార్యక్రమాల అమలుపై రాష్ట్ర నాయకత్వం దిశానిర్దేశం చేసింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు, జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ నాయకత్వంలో నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా చేపడుతున్న "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షలో చోటు చేసుకున్న అవకతవకలపై విద్యార్థులకు న్యాయం జరిగే వరకు యువజన కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేసి, విద్యార్థుల గొంతుకగా నిలవాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా జాతీయ యువజన కాంగ్రెస్ తీసుకొచ్చిన నూతన నియమ నిబంధనలను సమావేశంలో వివరించి, ప్రతి నాయకుడు, కార్యకర్త వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సంబంధిత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో సమన్వయం చేసుకుని జూలై 15లోగా డివిజన్ కమిటీలు, గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

## పోలీస్ అధికారులను ఖాళీ చేయించాలంటూ డీజీపీకి వినతి



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉన్నతాధికారుల క్వార్టర్స్‌లో నివసిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులను తక్షణమే ఖాళీ చేయించాలని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య డీజీపీని కోరారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్ డా. జి.ఈ.చ. విద్యాసాగర్‌తో కలిసి డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయంలో సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ క్వార్టర్స్‌లో చీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ తదితర ఉన్నతాధికారులు నివసిస్తూ విద్యార్థుల భద్రత, సంక్షేమం, క్రమశిక్షణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం కీలక పదవులు ఖాళీగా ఉండటంతో, అప్పటి యాజమాన్యం పోలీస్ అధికారుల అభ్యర్థన మేరకు తాత్కాలికంగా క్వార్టర్స్ కేటాయించింది. అవసరమైతే వెంటనే ఖాళీ చేయాలనే నిబంధనతోనే ఈ కేటాయింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. జనవరి 2025లో పూర్తి స్థాయి ఉన్నతాధికారులను నియమించిన అనంతరం, క్వార్టర్స్‌ను ఖాళీ చేయాలని విశ్వవిద్యాలయం పలుమార్లు కోరినా స్పందన రాలేదు. నోటీసులు జారీ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆగస్టు 2025లో అప్పటి డీజీపీ ఖాళీ చేయాలని ఆదేశించినా అమలు కాలేదని వెల్లడించారు. ఇటీవల జరిగిన వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశంలో ఈ అంశాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తాజాగా నియమితులైన డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన ఉపకులపతి, రిజిస్ట్రార్‌లు పరిస్థితిని వివరించగా, త్వరలోనే పోలీస్ అధికారులను క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం.

## దత్తాత్రేయుడికి మెడికవర్ హాస్పిటల్స్ ఘన సత్కారం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రపంచ ప్రఖ్యాత భారతీయఅమెరికన్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా. నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆంకాలజీ విభాగానికి చెందిన సీనియర్ వైద్యులు, నిపుణులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. సన్మాన కార్యక్రమం అనంతరం డా. నోరి క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతికత, భారతదేశంలో ఆంకాలజీ రంగ భవిష్యత్, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరంపై వైద్య బృందంతో చర్చించారు. కృష్ణా జిల్లా మంటాడ గ్రామానికి చెందిన డా. నోరి దత్తాత్రేయుడు కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని ప్రముఖ క్యాన్సర్ వైద్య సంస్థల్లో సేవలు అందించారు. బ్రాకీథెరపీ చికిత్సలో ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధిలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ డా. ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ, డా. నోరి సేవలు క్యాన్సర్ వైద్య రంగానికి విశేషంగా దోహదపడ్డాయని, పద్మభూషణ్ పురస్కారం ఆయనకు తగిన గౌరవమని తెలిపారు. మెడికవర్ ఆంకాలజీ కన్సల్టెంట్ డా. రిగ్వేద్ నిట్టాల మాట్లాడుతూ, డా. నోరి వైద్య జీవితం ప్రతి ఆంకాలజిస్టుకు ఆదర్శమని పేర్కొన్నారు. సన్మానానికి స్పందించిన డా. నోరి దత్తాత్రేయుడు, ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స ప్రతి రోగికి అందుబాటులోకి రావాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఈ గౌరవానికి మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. మాధాల రవికృష్ణతో పాటు సీనియర్ కన్సల్టెంట్లు, వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు

**మొయినాబాద్ , విశాలభారతి:** నీట్ పరీక్షల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో లోక్‌భవన్ కార్యక్రమం సందర్భంగా మొయినాబాద్ పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్, మండల కార్యదర్శి చరణ్ గౌడ్లను పోలీసులు అదుపులోకి తీసుకుని మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని విమర్శించారు. ముందస్తు అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదని, నీట్ పరీక్షల లీకేజీ వ్యవహారంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి





- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్
- రంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి – 15 గ్రామాల ప్రజల భారీ నిరసన

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ పరిధిలో ప్రభుత్వం ప్రతిపాదించిన ఎకో టౌన్ (డంపింగ్ యార్డు) ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. బాధిత గ్రామాల సర్పంచ్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు, బీఎస్పీ పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని డంపింగ్ యార్డు ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామా మల్లేష్ హాజరై ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే మూసీ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామాలపై మరోసారి డంపింగ్ యార్డు భారాన్ని మోపడం ప్రజా వ్యతిరేక చర్య అని విమర్శించారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనోపాధి, పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే వేలాది మంది ప్రజలతో కలిసి సచివాలయాన్ని ముట్టడించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. ఒకవైపు లక్షల కోట్ల రూపాయలతో మూసీ ప్రక్షాళన చేపడుతున్నామని ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు అదే మూసీ క్యాచ్‌మెంట్ ఏరియాలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. బండరావిరాల సర్వే నంబర్ 268లోని సుమారు 494 ఎకరాల విలువైన పచ్చని భూములను డంపింగ్ యార్డుగా మార్చడం అత్యంత దుర్మార్గమైన నిర్ణయమని ఆయన విమర్శించారు. పరిశ్రమలు, ఆసుపత్రులకు అనువైన ప్రాంతాన్ని చెత్త నిల్వ కేంద్రంగా మార్చి, ఔటర్ రింగ్ రోడ్డుకు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనావాసాల మధ్య మరో జవహర్‌నగర్ తరహా పరిస్థితిని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. గ్రామసభల అనుమతి లేకుండా, పర్యావరణ ప్రభావ అంచనా నిర్వహించకుండా, జీవోలు జారీ చేసి 16 గ్రామాల ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం చట్టవిరుద్ధమని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. ఒకవైపు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రచారం చేస్తూనే, మరోవైపు అదే మూసీ పరివాహక ప్రాంతంలో కొండలంత చెత్తను పోసి నదిని కలుషితం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ముఖ్యమంత్రికి అనుకూలంగా వ్యవహరిస్తూ రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్న ప్రజాప్రతినిధులు దమ్ముంటే ప్రతిపాదిత డంపింగ్ యార్డు పక్కనే ఇల్లు నిర్మించుకుని నివసించాలని సవాల్ విసిరారు. ఇది కేవలం భూముల కోసం జరుగుతున్న పోరాటం కాదని, భవిష్యత్ తరాల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం సాగుతున్న ప్రజా ఉద్యమమని పేర్కొన్న ఆయన, బీఆర్ఎస్ అధ్యక్షుడు కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్), కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి. రామారావు (కేటీఆర్) ఆదేశాల మేరకు బండరావిరాలలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా విరమించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆందోళనకారులు జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేసి డంపింగ్ యార్డు ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, చిన్నరావిరాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాళ్ల మహాలక్ష్మిదానయ్య, దేశముఖి సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్, జగత్‌పల్లి సర్పంచ్ ఇట్టమోని మహేష్‌యాదవ్, పెద్దగూడెం సర్పంచ్ నర్సిరెడ్డి, కవాడిపల్లి సర్పంచ్ కొలను ప్రసన్నలక్ష్మిరవీందర్ రెడ్డి, బలిజగూడ సర్పంచ్ ఉప్పు మాధవినవీన్ కుమార్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## 25 ఏళ్ల విద్యా సేవలకు ఘన వీడ్కోలు

**మొయినాబాద్ ఎంఈవో మల్లయ్యకు ఘన సన్మానం**



**మొయినాబాద్ , విశాలభారతి:** మొయినాబాద్ మండల విద్యాధికారి (ఎంఈవో) శ్రీ మల్లయ్య పదవీ విరమణ సందర్భంగా అజీజ్‌నగర్‌లోని టీవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల ఉపాధ్యాయులు ఘన సన్మాన సభ నిర్వహించారు. దాదాపు 25 ఏళ్ల పాటు మొయినాబాద్ మండలంలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, అనంతరం మండల విద్యాధికారిగా విద్యా సేవలు అందించిన మల్లయ్యను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, మల్లయ్య విద్యార్థుల అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విశేష కృషి చేశారని కొనియాడారు. పెద్దమంగళారం, ఎంకేపల్లి, వెంకటాపూర్, నాగిరెడ్డిగూడ పాఠశాలల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ మాజీ డైరెక్టర్ జగన్నాథ్ రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు హాజరై మల్లయ్యను ఘనంగా సన్మానించారు.వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 60 గజాల ఇళ్ల స్థలాల పోరాటానికి టీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

- ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది
- నేడు అదే ప్రభుత్వం వాటిని లాక్కుంటోంది



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో 60 గజాల ఇళ్ల స్థలాల కోసం యువజన సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తూ సభాధ్యక్షులు కట్ట మీద శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు జిల్లా నాయకుడు కుమ్మరి శివశంకర్ టీఆర్ఎస్ చేవెళ్ల బేగరి రాజు, టీఆర్ఎస్ మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు యండి అన్వార్ ఖాన్ పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం 290 మంది పేదలకు 60 గజాల ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసినప్పటికీ, 19 సంవత్సరాలు గడిచినా స్థలాలను అందించకపోవడం పేదల పట్ల అన్యాయమని విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చి, నేడు అదే ప్రభుత్వం వాటిని లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. పేదలకు కేటాయించిన స్థలాలను వెంటనే చూపించి, గృహ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతియుతంగా కొనసాగుతున్న ఈ ఉద్యమానికి టీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు షేక్ మహ్మద్ నూర్ భాయ్, నాగేష్, ఏనుగుల సంజీవరెడ్డి, బొక్క సురేందర్ రెడ్డి, ప్రవీణ్, బొక్క రవీందర్ రెడ్డి, కావలి శ్రీనివాస్ ముదిరాజ్, దర్శన్ గౌడ్, యండి యూనుస్, బోనాల ప్రభాకర్, గాండ్ల సంతోష్ కుమార్, యువజన సంఘాల నాయకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాల పెళ్లిళ్లకు అండగా కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గండిపేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 29 మంది లబ్ధిదారులకు రూ. 29 లక్షలకు పైగా ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు కుటుంబాలకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభిస్తోందని, ముఖ్యంగా పేద యువతుల వివాహాలకు ఇది పెద్ద తోడ్పాటుగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## బహిరంగ సభకు తరలిన నేతలు



**సికింద్రాబాద్, విశాల భారతి :** బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళానికి బిజెపి జాతీయ అధ్యక్షులు పిలుపుమేరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్లో భారీ బహిరంగ సభకు విచ్చేసిన బిజెపి అధ్యక్షులు,శక్తిపీఠాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు ఎగ్జిబిషన్ గ్రౌండ్లో తండోపతండాలుగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. భారతీయ జనతా పార్టీ తెలంగాణలో జెండా ఎగర పోవుచున్నది కనుక బిజెపి కార్యకర్తలు కృషితోనే కార్యక్రమాలు విజయవంతం చేయవలసిందిగా కోరుచు భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నిజాంపేట అధ్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, ఖైరతాబాద్ మహిళా బిజెపి నాయకురాలు వీణ ముదిరాజ్, శ్రీనివాస రాజ్, సుమన్ రావు, శిల్పారెడ్డి,మల్లేష్‌గౌడ్,రవి యాదవ్ లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## అర్హులైన ప్రతి జర్నలిస్టులకు న్యాయం చేయాలి

- మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ డిమాండ్



**మణుగూరు, విశాల భారతి :** జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో చోటు చేసుకున్నాయని వస్తున్న ఆరోపణలు, కార్డుల జారీలో అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన నిజమైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు విస్తృతంగా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు సేకరించి ప్రచురిస్తున్న పలువురు అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాకపోగా, తగిన సర్క్యులేషన్ లేదా ప్రచురణ ప్రమాణాలు లేని కొన్ని పత్రికలకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి డిపిఆర్ఓ పర్యవేక్షణా లేమితో జర్నలిజాన్ని ప్రధాన వృత్తిగా నిర్వహించని కొందరు రాజకీయ నాయకులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యక్తులు, మద్యం దుకాణాల్లో పనిచేస్తు న్న వారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోందని, ఈ అంశాలపై నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని కోరారు.అంతేకాక అర్హతలపై సందేహాలు ఉన్న కొందరికి కార్డులు జారీ అయినట్లు ప్రచారం జరుగుతోందని తెలి పారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగిందా లేదా అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించాలని, విచారణలో అక్రమాలు తేలితే అనర్హులకు జారీ చేసిన కార్డులను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అలాగే అన్యాయానికి గురైన అర్హులైన నిజమైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయా లని, భవిష్యత్తులో ఈ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై వినతి పత్రం అందించేం దుకు జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) కార్యాలయానికి వెళ్ళగా అక్కడ ఖాళీ కుర్చీలే దర్శనమి స్తున్నాయని,ఉదయం 11.20 గంటలు దాటినా డిపిఆర్ఓ ఉద్యోగుల సీట్లు ఖాళీగా కనిపించడం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అత్యవసర పనుల నిమిత్తం కార్యాలయా నికి వచ్చిన ప్రజలు, జర్నలిస్టులకు సంబంధిత అధికారి ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమయపాల న పాటించని ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఐదు పంచాయతీల విలీనం ప్రభుత్వ ప్రపోజల్లో ఉంది

- జిల్లా అదునపు కలెక్టర్ స్పష్టత
- ఐదు పంచాయతీలపై ఇచ్చిన మెమోరాండానికి స్పందన
- ప్రజా సంఘాల జేఏసీ ఐదు పంచాయతీల పై నివేదిక అందజేత.
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అదనపు కలెక్టర్



**భద్రాచలం , విశాలభారతి:** ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆంధ్ర తెలంగాణ విభజన అనంతరం భద్రాచలం భూభాగం పూర్తిగా నష్టపోయిందని ప్రజాసంఘాల జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్కు విన్నవించారు. జిల్లా అదనపు కలెక్టర్ మెమోరాండం తీసుకుంటూ ఈ విషయం ప్రభుత్వ ప్రపోజల్ లో ఉందని ఐదు పంచాయతీల సమస్యను ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రజాసంఘాల జేఏసీ నాయకత్వం పత్రికా ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం పట్టణం వరకే తెలంగాణలో ఉందని రాములవారు భూములు వేల ఎకరాలు ఆంధ్రాలో ఉండటం వలన పుణ్యక్షేత్రం అభివృద్ధికి నోచుకోవట్లేదని వారు వివరించారు. ఉష్ణ గుండాల ఎటపాక జటవాయు వంటి సందర్శనార్థమైన ముఖ్య కేంద్రాలు కనుమరుగయ్యాయని వారు ఆవేదన చెందారు. భద్రాచలం భూభాగం ఆంధ్ర లో కలవడం వలన పరిపాలన విభాగం మొత్తం అస్తవ్యస్తంగా తయారైందని భద్రాచలం కేంద్రంగా ఉండాల్సిన ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు కొత్తగూడెం పాలవంచ వంటి ప్రాంతాలకు తరలి వెళ్లాయని వారు వెల్లడించారు. ఈ ఐదు పంచాయతీల ప్రజలు పరిపాలన పరంగా సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని ప్రక్కనే భద్రాచలం పట్టణం ఉన్న అన్ని సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నప్పటికీ ఆంధ్ర అవటం వలన అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటున్నారని వారు తెలిపారు. ఉద్యోగాలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు నిరుద్యోగులకు సామాన్య ప్రజానీకానికి పరిపాలన సౌలభ్యం లేకపోవటం వలన ఈ ప్రాంత ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. భద్రాచలం ఈ ఐదు పంచాయతీలతో విలీనం అవటం వలన ఈ ప్రాంతం భౌగోళికంగా అభివృద్ధి చెందుతుందని అనేక ప్రభుత్వ కార్యాలయాలు అభివృద్ధి సంస్థలు ఇక్కడే ఉండటం వలన ప్రజలకి సౌకర్యవంతంగా ఉంటుందని వారు అన్నారు. అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించాలని , నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులు సమస్యను పరిష్కరించాలని అలాగే నిరుపేద విద్యార్థులు స్కాలర్షిప్లు లేక చదువుకు దూరం అవుతున్నారని ప్రభుత్వం పెండింగ్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని తదితర సమస్యల పైన జిల్లా కలెక్టర్కు తెలియజేస్తామని వారు అన్నారు. ప్రతి సమస్య పైన సానుకూలంగా స్పందించారని జిల్లా అదనపు కలెక్టర్ ఐదు పంచాయతీల సమస్య ప్రభుత్వ ప్రపోజల్ ఉందని ఆ సమస్య పైన ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని ప్రజా సంఘాల జేఏసీ నాయకత్వానికి తెలిపారు సమస్యల పైన స్పందించిన కలెక్టర్ అలాగే అదనపు కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## బసవతారక కాలనీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



- డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన
- బసవతారక కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభం
- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల వివరాలు అందించాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎమ్మెల్యే సూచన.

**పాల్వంచ విశాల భారతి:-**

కొత్తగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్వంచ మండలంలో పర్యటించి లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను సందర్శించి పనుల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం బసవతారక కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులై కూడా ఇళ్లు మంజూరు కాని కుటుంబాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న అభివృద్ధి పనుల అమలులో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కోరారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా అధ్యక్షుడు షాబీర్ పాషా, పాల్వంచ తహసీల్దార్ దార ప్రసాద్, సర్పంచ్ జర్పుల కాశమ్మ, రూరల్ ఎస్ఐ బాల్దే సురేష్, కొడుపుగంటి శ్రీనివాస్, జర్పుల వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నలిన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎన్ఐటీ వరంగల్, సీబీఐటీ మధ్య అవగాహన ఒప్పందం

**విశాలభారతి:**




నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ మరియు చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), హైదరాబాద్ మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడానికి అవగాహన ఒప్పందం అధికారికంగా మార్పిడి చేసుకున్నారు. ఈ అవగాహన ఒప్పందాన్ని ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ మరియు సీబీఐటీ ప్రిన్సిపాల్ పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, డీన్ (అకాడెమిక్), ఎన్ఐటీ వరంగల్, మరియు డా. ఎస్. శివ ప్రియాంక, అసిస్టెంట్ డైరెక్టర్, ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ కొలాబరేషన్స్ (ఐఐసి ), సీబీఐటీ, ఈ సహకార కార్యక్రమానికి సంస్థాగత సమన్వయకర్తలుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ వి. బర్లా, అడ్వైజర్, ఐఐసి, సీబీఐటీ; ప్రొఫెసర్ సిరీష్, డీన్ , సీబీఐటీ; ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, డైరెక్టర్, సీబీఐటీ; ప్రొఫెసర్ రష్మి రాజన్ రౌత్, హెడ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్ఐటీ వరంగల్; ప్రొఫెసర్ ఎన్.ఎల్.ఎన్. రెడ్డి, సీడీసీ, సీబీఐటీ, అలాగే ఇరు విద్యాసంస్థల నాయకత్వ బృందాలు మరియు అధ్యాపకులు హాజరై ఈ ఒప్పందానికి సాక్షులుగా నిలిచారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యా నాణ్యత, సంయుక్త పరిశోధన, ఆవిష్కరణలు, అధ్యాపకుల అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్య వికాసం, విద్యార్థి–అధ్యాపక మార్పిడి కార్యక్రమాలు, పరిశ్రమలతో అనుసంధానమైన కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాప్లు, శిక్షణా కార్యక్రమాలు, ఆవిష్కరణలు మరియు వ్యవస్థాపకత వంటి అనేక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరు సంస్థలు సంకల్పించాయి. భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిశోధకులకు కొత్త అవకాశాలు లభించడంతో పాటు, ఉన్నత విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించి, పరిశోధన మరియు సాంకేతిక అభివృద్ధికి తోడ్పడే అనేక ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఇరు సంస్థల ప్రతినిధులు తెలిపారు.

## న్యాయవాదులకు అన్యాయం జరుగుతోంది

**విశాలభారతి:** తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎస్. సురేందర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం, సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం సమర్పించింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణ ప్రాంతీయ పరిస్థితులపై అవగాహన కలిగిన స్థానిక న్యాయవాదులకే ప్రాధాన్యత ఇవ్వాలని, సామాజిక న్యాయ సూత్రాల ప్రకారం అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని వారు కోరారు. ఇతర ప్రాంతాల వారు స్థానికతను తప్పుగా చూపుతూ అవకాశాలు దక్కించుకోవడం వల్ల రాష్ట్రానికి చెందిన ప్రతిభావంతులైన న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ విషయమై నిర్వహించిన సర్వసభ్య సమావేశ తీర్మానం మరియు శాంతియుత నిరసనల గురించి గవర్నర్‌కు వివరిస్తూ, తమ న్యాయబద్ధమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో సంఘం ఉపాధ్యక్షులు డి.ఎల్. పాండు, కార్యదర్శులు పి. శ్రవణ్ కుమార్ గౌడ్, నిరంజన్ రెడ్డి కె. మరియు జాయింట్ సెక్రటరీ పి. కృష్ణ కీర్తన పాల్గొన్నారు.





## "ఆలోచన" చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన

# పద్మశ్రీ మురళి మోహన్ గారు

పి.ఎస్.జె ఫిలిమ్స్ కో బ్యానర్ లో ప్రదీప్ కుమార్, శ్రీనివాస్ గుండబోయిన నిర్మించిన చిత్రం "ఆలోచన". సీనియర్ నటులు జి.వి. నారాయణ రావు, ప్రసాద్ బాబు, నరసింహరాజు, రాజన్ హరి , మహర్షి రాఘవ, జయలలిత మరియు నూతన పరిచయం సీనియర్ నటుడు సుధాకర్ గారి అబ్బాయి బెన్నీ సుధాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సురేందర్ చాచా కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ను పద్మశ్రీ మురళి మోహన్ గారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళి మోహన్ గారు మాట్లాడుతూ ... అద్భుతమైన నటుల కాంబినేషన్ తో స్నేహం పై ఒక మంచి కాన్సెప్ట్ తో ఆలోచన చేశారని మంచి సంకల్పం తో నిర్మాతలు ప్రదీప్ కుమార్, శ్రీనివాస్ గుండబోయిన సినిమాను నిర్మించారు అని ప్రశంసించారు. ఈ చిత్రానికి సాంకేతిక వర్గం కెమెరా: టి. సురేంద్ర రెడ్డి, సంగీతం: వియాన్ , పాటలు: ప్రతాప్ రాజులపల్లి, ఎడిటర్: ఆర్.ఎల్.వర్మ, ఆర్ట్: గిరీష్ దేవాంగ్, ఈ.పి: సీ.హెచ్.విజయ్ కుమార్. మంచి కథాబలం ఉన్న "ఆలోచన" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది, ఈ సినిమా విజయం సాధించి, చిత్ర యూనిట్ కు మంచి పేరు రావాలని కోరుకుంటున్నట్లు" తెలిపారు. షూటింగ్ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ఆలోచన" చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది, ఈ సినిమాకు సంబంధించిన టీజర్ , ట్రైలర్ త్వరలో విడుదల కానున్నాయి.

## మరిపెడ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభం



**మరిపెడ, విశాల భారతి:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అకాడమిక్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరిపెడలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు మరియు అసిస్టెంట్ కోఆర్డినేటర్ జనార్ధన చారి తెలిపారు. చదువును మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు, ఇతర కారణాల వల్ల విద్యను కొనసాగించలేకపోయిన వారు తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా మళ్లీ చదువు ప్రారంభించి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.అర్హత కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రంతో పాఠశాల కార్యాలయంలో సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జూలై 28 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7729967711 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్లకు కొత్త రూల్స్

**పేదవాడి సొంతింటి కలపై ఆకాంక్షల అడ్డంకులు**

**కోదాడ, విశాలభారతి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఆంక్షాలు విధించడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధిదారులు తమకు నచ్చిన విధంగా, అవసరాలకు అనుగుణంగా ఇళ్లు కట్టుకోకుండా అడ్డుకోవడం పట్ల పేదలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతింటి కల నెరవేర్చుకుందామని ఆశపడిన వారికి ఈ నిబంధనలు తీవ్ర నిరాశను మిగులుస్తున్నాయి.

**స్లాబ్ విస్తీర్ణంలో ఆంక్షలు..**

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. అయితే, లబ్ధిదారులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు... గృహనిర్మాణ శాఖ తాజాగా శ్లాబు పరిమాణంపై కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చింది.ఇంటి శ్లాబు విస్తీర్ణం కచ్చితంగా 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది.స్లాబ్ ముందు వైపు 3 అడుగులు, మిగతా వైపులా కేవలం 1 అడుగు మాత్రమే పొడిగింపు (ప్రొజెక్షన్) ఉండాలని ఆదేశించింది.

**పేదవాడి ఆకాంక్షలపై నీరుగారుతున్న ఆశలు..**

ప్రభుత్వం ఇస్తున్న ఈ పరిమితులపై లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. తమ స్థలానికి, కుటుంబ అవసరాలకు తగినట్లుగా ప్లాన్ చేసుకుని.. అదనపు స్థలంలో అప్పులు చేసైనా ఇల్లు నిర్మించుకుందామని అనుకున్న పేదలకు ఈ రూల్స్ పెద్ద షాక్‌గా మారాయి. పల్లెల్లో, పట్టణాల్లో వాన, ఎండల నుంచి రక్షణగా ఎక్కువ శ్లాబులు వేసుకోవాలని భావిస్తే.. ప్రభుత్వ అధికారులు దీన్ని అడ్డుకోవడం, చెప్పినట్లు వినకపోతే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

**లబ్ధిదారుల ఆవేదన..**

పరిసర ప్రాంతాల్లో చాలా మంది పేదలు తమకున్న అరకొర స్థలంలోనే పక్కా ఇల్లు నిర్మించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మేస్త్రీలు, స్థానిక అవసరాల మేరకు శ్లాబు విస్తీర్ణం పెంచుకుంటేనే ఇల్లు సౌకర్యవంతంగా ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారు. కానీ, ప్రభుత్వం అదనపు శ్లాబులు వేయొద్దని, కిటికీలకు సన్‌షేడ్లు మాత్రమే వాడుకోవాలని కండిషన్లు పెట్టడం పేదవాడి సొంతింటి కలపై ఆంక్షలు విధించడమేనని స్థానిక ప్రజా సంఘాలు, లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం పేదవాడి మనోభావాలను గుర్తించి, కఠిన నిబంధనలను సడలించి, లబ్ధిదారులకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లాలో ఘనంగా వట సావిత్రి పౌర్ణమి వేడుకలు



**విశాలభారతి, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు దస్తురాబాద్, కడెం, ఖానాపూర్, లక్ష్మణచందా, మామడ, సోన్, సారంగాపూర్, దిల్వార్పూర్, నర్సాపూర్, కుంటాల, కుబీర్, భైంసా, లోకేశ్వరం, తానూర్, ముధోల్, బాసర మండలాల పరిధిలోని ఆయా గ్రామాలలో సోమవారం వటసావిత్రి పౌర్ణమిని పురస్కరించుకొని మహిళలు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జస్టియ పౌర్ణిమ శుద్ధ ద్వాదశి రోజునే ప్రదోషకాలంలో అరబిస్తారు. కొందరు జస్టయ అమావాస్యకు కూడా స్త్రీలు ఐదవతరాన్ని గొప్ప వరంగా భావిస్తారు. అనేక వ్రతాలు పూజలు చేస్తారు మంగళ గౌరీ వ్రతం వరలక్ష్మీ వ్రతం వట సావిత్రి వ్రతం వంటివి విశేషమైనవి వీటిలో వటసావిత్రి వ్రతం నీకు ప్రత్యేకత ఉంది. ఈ వ్రతాన్ని వటవృక్షంతో పూజ చేయడం మంచిది, వటవృక్షం అనగా మర్రిచెట్టు భారతీయుల జాతి వృక్షం మర్రిచెట్టును త్రిమూర్తుల సంయుక్త స్వరూపంగా భావిస్తారు మర్రిచెట్టు వేళ్ళు బ్రహ్మకు కాండం విష్ణువుకు కొమ్మలు శివునికి వ్యవస్థ స్థలాలు ఈ వ్రతం రోజు సుమంగళులు వటవృక్షునికి పసుపు కుంకుమలతో పూజిస్తే మంచిది వటవ రక్షాన్ని పువ్వులతో అలంకరించి దాదులు మొదలైన అలంకరణ సామాగ్రిని సమర్పించి ధూప దీప నైవిద్యాలతో పూజించి తర్వాత వటవృక్షం చుట్టూ 108 సార్లు ప్రదక్షిణలు చేస్తూ ముడి ప్రతి నుండి బడికి తీసిన దారాన్ని రక్షణ చుట్టూ చుట్టుకుంటూ ప్రదక్షణ వేస్తారు వాటి వృక్షం యొక్క దీర్ఘ యుర్దాయంతో తమ భర్తల ఆయుష్షును బంధించడమే ఇలా దారం చుట్టడంలోని అర్థం ఉంటుందని ముఖ్యంగా వణితలు పెళ్ళికాని వారు ఈ పూజలు చేస్తూ ఉంటారు కోట పౌర్ణమికి మూల కారణం గా కూడా చెప్పుకోవచ్చు అంతేకాకుండా కుటుంబంలో అందరూ సుఖశాంతులతో ఉండి పాడి పంట రైతు సుభిక్షంగా ఉండాలని సకలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలకు దిగుబడి రావాలని కోరుతూ కోట పౌర్ణమి దినాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలు మహిళలు పెద్ద సంఖ్యలో జరుపుకున్నారు.



# వేద విద్యార్థి పార్వతీ

'ఇందులో నా పాత్ర పేరు 'పార్వతి'. కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా వెళ్లే వ్యక్తిత్వం ఆమెది. వేద విద్యార్థిగా కనిపిస్తా. ఈ పాత్ర కోసం రెడీ అవ్వడానికి రెండు గంటలు పట్టేది. కథలో కీలకమైన పాత్ర. పార్వతి తీసుకొనే ప్రతి నిర్ణయం కథపై ప్రభావం చూపుతుంది. అరుదుగా దొరికే పాత్ర ఇది' అని తెలిపింది నటి నభా నటేష్. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్'. విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక అడ్వెంచర్ థ్రిల్లర్ జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నభానటేష్ విలేకరులతో మాట్లాడింది. 'అభిషేక్‌నామా క్లియర్ విజన్‌తో ఈ సినిమా తీశారు. కాస్ట్యూమ్స్, హెయిర్‌స్టైల్.. ఇలా చిన్న చిన్న విషయాల్లోనూ శ్రద్ధ తీసుకున్నారు.ప్రీ ప్రొడక్షన్ వర్క్ పక్కాగా చేసుకున్నారు. ఈ సినిమా కోసం నిర్మించిన అనంతపద్మనాభస్వామి ఆలయం సెట్ అద్భుతం. నిజంగా నిజమైన ఆలయాన్నే తలపించింది. 5వేల మంది డాన్సర్‌స్‌తో గణేష్ ఆచార్య మాస్టర్ నేతృత్వంలో నాపై చిత్రీకరించిన 'నమోరే..' సాంగ్ విజువల్ ఫీస్ట్‌గా ఉంటుంది. అంత పెద్ద కాన్వాస్‌పై పాట చిత్రీకరించడం ఒక ఛాలెంజ్' అని పేర్కొన్నది నభా నటేష్. ఈ సినిమా కోసం దాదాపుగా పది సెట్లు నిర్మించారని, ప్రతి సెట్ ఒక దానికొకటి భిన్నంగా ఉంటుందని, కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈచిత్రాన్ని నిర్మించారని, ప్రమోషన్స్ కూడా వినూత్నంగా చేశారని, అనంతపద్మనాభస్వామి రథయాత్ర కాన్సెప్ట్ జనాన్ని ఆకట్టుకున్నదని నభా నటేష్ చెప్పారు. విరాట్‌కర్ణ డెడికేషన్ ఉన్న నటుడని, కష్టపడి నటించాడని, తనకు ఈ సినిమాతో మంచి పేరొస్తుందని, సౌందర్‌రాజన్ సినిమాటోగ్రఫీ, వీఎఫ్‌ఎక్స్ వర్క్ రియల్‌గా అనిపిస్తాయని నభానటేష్ పేర్కొన్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.